

తవ్వకాలే లేనప్పుడు

నెల్లూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌జీటీ సదరన్ బెంచ్ ఆదేశాల మేరకు జిల్లా ఉన్నతాధికారులు విరువూరు, అప్పారావుపాలెం ఇసుక రీచ్‌లను పరిశీలించారు. అయితే ఆ రీచ్‌లలో గతేడాది నుంచి తవ్వకాలు ఆగిపోయి ఉన్నాయి. ఈ విషయాన్ని ఎన్‌జీటీకి కలెక్టర్ నివేదించారు. కానీ తవ్వకాలు

ఇసుక ఎక్కడిది సారూ!

తవ్వకాలు లేవని ఎన్‌జీటీకి కలెక్టర్ నివేదిక

- ఆపరేషన్‌లో లేని రీచ్‌లలో పరిశీలించి లేఖ
- మరి జిల్లాలో వాడుతున్న ఇసుక ఎక్కడిది!?
- ఇతర రాష్ట్రాలకు తరలుతున్నదీ ఏ రీచ్‌లోది?
- మినగల్లు, పల్లిపాడు, ముదివర్తి, పీకే పాడులలో జరుగుతున్నదేంటి!?
- జిల్లా ఉన్నతాధికారుల తీరుపై విస్మయం

లక్షల మంది సామాన్యుల ఆవేదన కన్నా ఒక మేధావి మౌనం సమాజానికి చాలా ప్రమాదమని పెద్దలు చెబుతుంటారు. ఇసుక తవ్వకాలన్నీ అక్రమాలే అని సామాన్యులు గగ్గోలు పెడుతున్నా మేధావులైన అధికారులు మాత్రం మౌనం దాల్చుతున్నారు. జిల్లాలో విచ్చలవిడిగా, పర్యావరణ అనుమతులు లేకుండా పెన్నమ్మను కుళ్లబొడిచి దోచుకుంటుంటే ఉన్నతాధికారులు మాత్రం ఎక్కడా ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు కనిపించడం లేదని ఏకంగా జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ)కు నివేదిక ఇవ్వడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.



అనంతసాగరం: పడమటి కంభంపాడు రీచ్‌లో ఇసుక తవ్వకాలు

జరుగుతున్న పడమటి కంభంపాడు, మినగల్లు, ముదివర్తి, పల్లిపాడు రీచ్‌లవైపు మాత్రం అధికారులు కన్నెత్తి చూడలేదు. అసలు ఈ విషయాన్ని నివేదికలో పొందుపరచలేదు. అంటే ఉన్నతాధికారులే ఎన్‌జీటీకి తప్పుడు నివేదిక ఇచ్చినట్లు స్పష్టమవుతోంది.

• యథేచ్ఛగా తవ్వకాలు

కలెక్టర్ నివేదిక కరెక్ట్ అనుకుంటే మరి జిల్లాలో వినియోగిస్తున్న ఇసుక అంతా ఎక్కడిదన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. అలానే నిత్యం వందల లారీల్లో చెన్నై, బెంగళూరులకు తరలుతున్న ఇసుక ఎక్కడి నుంచి తవ్వుతున్నారన్న మరో ప్రశ్న కూడా తలెత్తుతోంది. వీటికి సదరు ఉన్నతాధికారులే సమాధానం చెప్పాలి. నాలుగు ప్రధాన రీచ్‌లలో నిత్యం వేల టన్నుల ఇసుకను తవ్వి సొమ్ము చేసుకుంటున్నారన్నది బహిరంగ రహస్యం. మినగల్లు, పడమటికంభంపాడు, ముదివర్తి, పల్లిపాడు రీచ్‌లలో 'ఆంధ్రజ్యోతి' బృందం పరిశీలించగా యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరుగుతుండటం గమనార్హం. మరి ఉన్నతాధికారులు ఎక్కడా ఇసుక తవ్వకాలు జరగలేదని నివేదిక ఎవ్వడం ఏమిటని ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వంలోని కొందరు పెద్దల డైరెక్షన్‌లో ఉన్నతాధికారులు నడుస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్‌జీటీ ఆదేశాలను కూడా తుంగలో తొక్కి

ఆపరేషన్‌లోని లేని రీచ్‌లలో పరిశీలించి చేతులు దులుపుకున్నారని, ఈ రీచ్‌లలోనే పరిశీలన చేయాలని కూడా రాష్ట్రస్థాయి నుంచి ఆదేశాలు వచ్చినట్లు అధికారులు చెబుతుండడం గమనార్హం. రాష్ట్రస్థాయిలో తయారు చేసిన నివేదికనే అన్ని జిల్లాల కలెక్టర్లు ఎన్‌జీటీకు పంపారని కూడా ప్రచారం జరుగుతోంది. అన్ని జిల్లాల నివేదికలో ఒకే ఫార్మాట్‌లో ఉండడంపై ఎన్‌జీటీ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసింది.



మినగల్లు రీచ్‌లో ఇసుక కొనుగోలుకు గురువారం ఇచ్చిన బిల్లు

• ప్రతిమాకు అప్పగించినట్లు డైరెక్టర్ లేఖ

జిల్లాలో ఇసుక తవ్వకాల టెండర్‌ను ప్రతిమా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సంస్థకు అప్పగించినట్లు గనుల శాఖ డైరెక్టర్ గత డిసెంబరు 22వ తేదీన జిల్లా కలెక్టర్‌కు లేఖ పంపారు. డిసెం బరు 11 నుంచి జిల్లాలోని అన్ని రీచ్‌లలో ప్రతిమా సంస్థనే తవ్వకాలు జరుపుతుందని తెలియజేస్తూ అదే లేఖ కాపీను ఎస్పీకు కూడా పంపారు. అప్పటి నుంచి ఆ సంస్థ పేరు మీదనే మాన్యువల్ బిల్లులు జారీ చేస్తూ తవ్వకాలు జరుపుతు న్నారు. ఈ విషయం కలెక్టర్‌తోపాటు సంబంధిత శాఖల అధికారులందరికీ తెలుసు. అయితే జిల్లాలో తవ్వ కాలు జరుపుతున్న నాలుగు రీచ్‌లలో ఏ ఒక్క రీచ్‌కు కూడా పర్యావరణ అనుమతి (ఈసీ) లేదు. ఈసీ లేకుండా తవ్వకాలు జరపకూ డదన్న నిబంధనలను తుంగలో తొక్కా రు. భారీ యంత్రాలతో, భారీ గుం తలు పెడుతూ తవ్వకాలు చేస్తుండటంతో భూగర్భ జలాలకు ప్రమాదకరంగా మారింది. ఇంత బహిరంగంగా తవ్వకాలు జరుగుతున్నా ఉన్నతాధి కారులు మాత్రం అసలు తవ్వకాలే జరగడం లేదంటూ ఎన్‌జీటీకు నివేదిక ఇవ్వడం ప్రజల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది.

ఆదాల, ఆనం ఎవరు బెటర్!

• రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థిపై 'ఐప్యాక్' ఆరా



నెల్లూరురూరల్, ఫిబ్రవరి 22 : నెల్లూరురూరల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డిలలో ఎవరు బెటర్? వీరిలో ప్రజాదరణ ఎవరికి ఉంది? మీరు ఎవరికి మద్దతిస్తారు? అంటూ ఐ ప్యాక్ బృందం నెల్లూరురూరల్ మండలంలోని పలు గ్రామాలలో సర్వే నిర్వహించింది. అత్యంత విశ్వసనీయ సమాచారం మేరకు.. మంగళ, బుధవారాలలో నెల్లూరుకు పడమరనున్న గ్రామాలలో నలుగురు సభ్యులతో కూడిన ఐ ప్యాక్ బృందం పర్యటించింది. ఎమ్మెల్యే అభ్యర్థిగా వైసీపీ నుంచి ఆదాల, ఆనంలలో ఎవరికి గెలిచే ఛాన్సు ఉంది. పార్టీపరంగా క్షేత్రస్థాయిలో వీరిద్దరిలో నాయకులు, కార్యకర్తలు ఎవరికి పని చేస్తారు? అన్న కోణంలో సర్వే నిర్వహించారు. అలాగే ఇటీవల వైసీపీని వీడి టీడీపీలోకి వెళ్లిన వారు తిరిగి సొంత గూటికి రావాలంటే ఎలా? వారి ఆదాయ వనరులు ఏమిటి? పోలీసుస్టేషన్లలో వారిపై కేసులు ఉన్నాయా!? తదితర అంశాలపై క్షుణ్ణంగా ఆరా తీసినట్లు సమాచారం.

టీడీపీలోకి రండి!

వీపీఆర్‌కు 'దేశం' ముఖ్యనేతల ఆహ్వానం

భారీగా తరలివచ్చి మద్దతు • వేమిరెడ్డి సుముఖత



వీపీఆర్‌ను సత్కరించిన కోటంరెడ్డి, ఉచ్చి తదితరులు

నెల్లూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీలో చేరాలంటూ రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దంపతులను ఉమ్మడి నెల్లూరు జిల్లా టీడీపీ ముఖ్యనేతలు ఆహ్వానించారు. అన్ని నియోజకవర్గాల ఇన్‌చార్జులు, ఇతర ప్రధాన నాయ కులు గురువారం నెల్లూరులోని వీపీఆర్ నివాసానికి వెళ్లి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీపీఆర్ దంపతులను సన్మానించారు. అనంతరం వివిధ అంశాలపై వారు సుదీ ర్ఘంగా చర్చించుకున్నారు. టీడీపీలో చేరేందుకు వీపీఆర్ సముఖత వ్యక్తం చేసినట్లు భేటీ అనంతరం టీడీపీ నేతలు వెల్లడించారు. మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పొంగూరు నారాయణ, జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నెల్లూరు పార్ల మెంటు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జులు పాశిం సునీల్‌కుమార్, ఇంటూరి నాగేశ్వరరావు, పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, నెలవల సుబ్రహ్మణ్యం, ముఖ్య నేతలు మాలేపాటి సుబ్బానాయుడు, కావ్య కృష్ణారెడ్డి, తాళ్లపాక రమేష్‌రెడ్డి, అనురాధ, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, జెడ్ శివప్రసాద్ తదితరులు వీపీఆర్‌ను కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి, నారాయణ, రవిచంద్ర, అజీజ్‌లు మీడియాతో మాట్లాడారు. రాజకీయాల్లో హుందాగా వ్యవహరిస్తూ, పేదల సమస్యలను సొంత నిధులతో పరిష్కరించే వ్యక్తిత్వం కలిగిన వే మిరెడ్డిని టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించినట్లు వెల్లడించారు. వేమిరెడ్డి కూడా ఇందుకు సానుకూలంగా స్పందించారని వారు పేర్కొన్నారు. త్వరలోనే పార్టీలో చేరే అవకాశముందని వ్యాఖ్యానించారు.



వేమిరెడ్డితో సమావేశమైన టీడీపీ ముఖ్య నాయకులు

పెరుగుతున్న మద్దతు

వైసీపీ నుంచి బయటకొచ్చాక వీపీఆర్‌కు మద్దతు భారీగా పెరుగుతోంది. అనేక మంది వైసీపీ నాయకులు కూడా వీపీఆర్ వెంట నడిచేందుకు సిద్ధమవుతున్నారు. అటువంటి వారంతా వీపీఆర్ నివాసానికి తరలివస్తూ వీపీఆర్‌ను కలిసి మద్దతు ప్రకటిస్తున్నారు. అలానే టీడీపీ, జనసేన నేతలు కూడా భారీగా వీపీఆర్‌ను కలుస్తున్నారు. దీంతో వేమిరెడ్డి నివాసం మద్దతుదారులతో కిటకిటలాడుతోంది. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి భారీ సంఖ్యలో సిటీ నియోజకవర్గ నాయకులతో కలిసి వీపీఆర్‌ను కలిశారు. అన్ని డివిజన్ల నుంచి ముఖ్య నేతలందరూ జిల్లా పార్టీ కార్యాలయానికి చేరుకోగా అక్కడి నుంచి నడుచుకుంటూ వీపీఆర్ నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా వీపీఆర్‌ను ఘనంగా సత్కరించారు. ప్రతి డివిజన్ నాయకులను కోటంరెడ్డి వీపీఆర్‌కు పరిచయం చేశారు. అనంతరం కోటంరెడ్డి మాట్లాడుతూ నిస్వార్థ ప్రజా సేవకుడు వేమిరెడ్డి అని కొనియాడారు. అనేక మంది పేదలకు సాయం చేసిన గొప్ప వ్యక్తులు వీపీఆర్ దంపతులని చెప్పారు.

కాంగ్రెస్ నాయకుల గృహ నిర్బంధం

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 22 : మెగా డీఎస్సీ విడుదల చేయాలంటూ గురువారం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన చలో సెక్రటరేట్ కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు విజయవాడకు వెళ్లకుండా అర్ధరాత్రి తర్వాత పోలీసులు నోటీసులు ఇచ్చి అడ్డుకున్నారు. నెల్లూరులో డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డిని విజయవాడకు వెళ్లకుండా ఇంటిలో నిర్బంధించారు. దీంతో పోలీసులతో చేవూరు వాగ్వివాదానికి దిగారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు అండగా నిలవాలన్న ఉద్దేశంతో మెగా డీఎస్సీని వేయాలని నిరసన తెలిపేందుకు వెళుతున్న షర్మిలను అరెస్టు చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగానికి విరుద్ధంగా రాజారెడ్డి ఫ్యాక్షన్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజలను భయబ్రాంతులకు గురి చేస్తున్న ముఖమంత్రి జగన్మోహన్‌రెడ్డి పైశాచిక ఆనందాన్ని అనుభవిస్తున్న ఏకైక వ్యక్తిగా చరిత్రలో నిలిచి పోతారని విమర్శించారు.

సీన్ రివర్స్!

వీపీఆర్ రాజీనామాతో తిరగబడిన వైసీపీ పరిస్థితి



బండ్లు ఓడలు- ఓడలు బండ్లు అవుతాయన్న నానుడిని నెల్లూరు రాజకీయాలు నిజం చేస్తున్నాయి. పక్షం రోజుల వ్యవధిలోనే నెల్లూరు రాజకీయాలు తలకిందులయ్యాయి. టీడీపీ, వైసీపీ బలాబలాలు సమూలంగా మారిపోయాయి. కొద్ది రోజుల క్రితం తెలుగుదేశం పార్టీ ఎదుర్కొన్న పరిస్థితులను ఇప్పుడు వైసీపీ అనుభవిస్తోంది. వైసీపీకి వీపీఆర్ రాజీనామా చేయడంతో నెల్లూరు ఎంపీ అభ్యర్థి కోసం దేవులాడుకొనే పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి.

నెల్లూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : 'చంద్రబాబు పాకులాడుతాడుకానీ జిల్లా తెలుగుదేశంలో నాయకుడు ఎవడున్నాడని. వైసీపీ అభ్యర్థులకు దీటైన వారు ఆ పార్టీలో ఎవరున్నారని?' టీడీపీ గురించి ప్రస్తావన వచ్చినప్పుడల్లా జిల్లాకు చెందిన వైసీపీ ముఖ్యనాయకులు ప్రస్తావించే మాటలివి. వైసీపీకి దీటైన నాయకులు టీడీపీలో లేరనేది ఆ పార్టీ ధీమా. అయితే చూస్తుండగానే ఆ పరిస్థితులు మారిపోయాయి. టీడీపీ అభ్యర్థులకు దీటైన వారి కోసం వైసీపీ వెతుకులాడే పరిస్థితి ఏర్పడింది. మూడు రోజుల క్రితం వరకు నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి ఎవరనే విషయంలో టీడీపీలో క్లారిటీ లేదు. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, మాగుంట శ్రీనివాసులురెడ్డి, అబ్దుల్ అజీజ్ ఇలా ఆప్షన్లు పెట్టుకున్నారు కానీ అభ్యర్థుల విషయంలో క్లారిటీ లేదు. అయితే, ఈ విషయంలో వైసీపీ చాలా ముందు ఉండేది. పార్టీ అభ్యర్థిగా వీపీఆర్ కొన్ని నెలలకు ముందు నుంచే ప్రచారం మొదలు పెట్టారు. పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలలో కలియ తిరిగారు. మొన్నటివరకు కూడా టీడీపీ నుంచి ఎంపీ అభ్యర్థి పేరుకాని, ప్రచారం కానీ జరగలేదు. అయితే, వీపీఆర్ మనస్తాపంతో ఒక్కసారిగా వైసీపీ సీన్ రివర్స్ అయింది. వైసీపీ ఎంపీ అభ్యర్థిగా ప్రచారంలో ఉన్న ఆయన తన వెనుక కుట్ర జరుగుతోందని, ఇందుకు పార్టీ అధిష్టానం సహకరించిందని, తనకు అక్కడ గౌరవం తగ్గిందని గ్రహించి పార్టీకి, పదవులకు రాజీనామా చేశారు. ఈ తరుణంలో తెలుగుదేశం ఈ అవకాశాన్ని అందిపుచ్చుకొంది. ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలోని టీడీపీ ముఖ్యనాయకులంతా గురువారం వీపీఆర్ నివాసానికి వెళ్లి తమ పార్టీలోకి రమ్మని సాదరంగా ఆహ్వానించారు. ఆయన కూడా సానుకూలంగా స్పందించారని ఆ పార్టీ నాయకులు తెలిపారు. వీపీఆర్ టీడీపీలో చేరుతున్న క్రమంలో నెల్లూరు పార్లమెంటుకు టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దించాలని అధిష్టానం నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఇప్పుడు టీడీపీకి దీటైన అభ్యర్థి కోసం వెతుకులాడుకునే పరిస్థితి అధికార వైసీపీకి వచ్చింది.

రెండున్నరేళ్ల తర్వాత నగరంలోకి మేయర్!



వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఖలీల్‌తో పాటు పాల్గొన్న మేయర్

నెల్లూరు(సిటీ) : నగర పాలక సంస్థ మేయర్ పొట్లూరి స్రవంతి రెండున్నరేళ్ల తర్వాత నగర నియోజకవర్గంలో తొలి అడుగుపెట్టారు. విరాట్ నగర్‌లోని వీబీఎస్ కల్యాణ మండపంలో గురువారం జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్ర మంలో మేయర్ పాల్గొన్నారు. మేయర్‌గా బాధ్యతలు స్వీకరించాక ఇప్పటివరకు నగరంలో ప్రభుత్వ, ప్రైవేట్ కార్యక్రమాలలో స్రవంతి పాల్గొనలేదు. నియోజకవర్గ సరిహద్దులకు కూడా రానివ్వకుండా నగర ఎమ్మెల్యే అనిల్ కార్యాలయం ఆంక్షలు విధించింది. అయితే, ఎమ్మెల్యేను నరసరావుపేట ఎంపీ అభ్యర్థిగా పంపిన పార్టీ పెద్దలు ఆయన స్థానంలో డిప్యూటీ మేయర్ ఖలీల్‌ను నియమించారు. దీంతో ఆయన సహకారంతో తొలిసారిగా సిటీ నియోజకవర్గంలో మేయర్ అడుగుపెట్టడంతో తాజా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

ఉపాధ్యాయులే టార్గెట్!

చార్జిమెమోలు, నోటీసులతో కలకలం

లొంగదీసుకునేందుకు ప్రభుత్వ యత్నం

ఆందోళన బాటలో ఉపాధ్యాయ సంఘాలు

పాఠశాలల్లో మరుగుదొడ్ల పరిశుభ్రతకు సంబంధించిన ఫొటోలను అప్‌లోడ్ చేయనందుకు 19 మంది హెచ్‌ఎంలకు, మధ్యాహ్న భోజనానికి సంబంధించిన ఫొటోలను అప్‌లోడ్ చేయలేదని 69 మంది హెచ్‌ఎంలకు, మధ్యాహ్న భోజన పథకానికి విద్యార్థుల సంఖ్య తక్కువగా నమోదవుతున్నారంటూ 75 మంది హెచ్‌ఎంలకు ఇటీవల డీఈవో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇలా గడిచిన నాలుగు రోజుల్లోనే వివిధ కారణాలతో 338 మంది హెచ్‌ఎంలు, టీచర్లకు నోటీసులు జారీ అయ్యాయి.



యాప్‌లతో యాతన..

నోటీసులతో ఒత్తిళ్లు!



నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 22 : ఉపాధ్యాయులపై ప్రభుత్వం కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతోందా!? అంటే జరుగుతున్న పరిణామాలు అవుననే చెబుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా నిర్బంధాన్ని పెంచిందన్న విమర్శలు టీచర్ల నుంచి వెల్లువెత్తుతున్నాయి. కొంతకాలం క్రితం విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పాఠశాలల ఆకస్మిక తనిఖీల పేరుతో టీచర్లను భయబ్రాంతులకు గురిచేయడంతో పాటు ఏదో ఒక తప్పు పట్టుకుని అధికారులందరి ముందు అవమానించడం, పరుష పదజాలం వాడిన సంఘటనలు తమను ఆవేదనకు గురిచేశాయని చెబుతున్నారు. తాజాగా జిల్లాలో 4 రోజులుగా 338 మంది హెచ్‌ఎంలు, టీచర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. తరగతి గదిలో చిన్న చిన్న తప్పులను పెద్దవిగా చూపిస్తూ భయబ్రాంతులకు గురిచేస్తున్నారంటున్నారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించారన్న కారణంతో నాలుగు రోజుల క్రితం జిల్లాలో 175 మంది ప్రధానోపాధ్యాయులకు డీఈవో రామారావు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిరోజూ 10.30 గంటలలోపు యాప్ ద్వారా విద్యార్థులకు హాజరు వేయాల్సి ఉంటుంది. అయితే, 3,300 మంది విద్యార్థుల హాజరు వేయకపోవడంతో డీఈఓ ఆగ్రహం వ్యక్తం చేస్తూ సంబంధిత హెచ్‌ఎంలకు నోటీసులు జారీ చేసి వెంటనే వివరణ అందచేయాలని ఆదేశించారు. అలాగే మరో మూడు రకాల కారణాలతో 163 మంది హెచ్‌ఎంలకు తాజాగా షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న హెచ్‌ఎంలు వెంటనే లిఖిత పూర్వక వివరణ ఇవ్వాలని, లేనిపక్షంలో శాఖాపరమైన చర్యలు తప్పవని డీఈఓ హెచ్చరించారు.

• బోధనేతర పనులే అధికం

విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన గురువులు నిత్యం యాప్‌లతో యాతన పడుతూ ప్రభుత్వ వేధింపులకు గురవుతున్నారు. పాఠశాలల్లో బోధన కంటే బోధనేతర పనులపైనే ఎక్కువ సమయం గడపాల్సి వస్తోంది. విద్యాశాఖ ప్రవేశపెట్టిన వివిధ యాప్‌లలో వివరాలు నమోదు చేయడానికి తంటాలు పడుతున్నారు. పిల్లలకు బోధించడానికి 8 పిరియడ్లు ఉంటే ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది యాప్‌ల నిర్వహణకే రోజుకు 3, 4 గంటల సమయం పడుతోందని గురువులు గగ్గోలు పెడుతున్నారు. మరోవైపు విద్యాశాఖ ఉన్నతాధికారులు పాఠశాలల్లో బోధన సకాలంలో పూర్తి చేయాలని, పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులను సంసిద్ధులను చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. ప్రభుత్వం తమపై కక్షగట్టి వేధింపులకు పాల్పడుతూ ఇబ్బందులకు గురిచేస్తోందని, తామంతా తీవ్ర ఒత్తిడితో విధులు నిర్వహిస్తున్నామంటూ ఉపాధ్యాయలు ఆవేదన చెందుతున్నారు.

• వేధించడమే లక్ష్యమా!?

ఉపాధ్యాయులను వేధించడమే లక్ష్యంగా ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఉపాధ్యాయ సంఘాల నేతలు వాపోతున్నారు. పాఠశాల పర్యవేక్షణ, విధుల నిర్వహణలో అల సత్వం ప్రదర్శిస్తున్నారంటూ తమను భయాందోళనకు గురిచేయ డంతోపాటు టీచర్ల పట్ల చులకనభావం ఏర్పడేలా, మనోధైర్యాన్ని దెబ్బతీసేలా అధికా రులు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో సమస్యలు పట్టించుకోకుండా ఉపాధ్యాయులపై కక్షసాధింపు చర్యల్లో భాగంగా చిన్నచిన్న కారణాలతో షోకాజ్ నోటీసులతో బెదిరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. అధికారులు తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు వారు మాత్రమే విధి నిర్వహణ చేస్తున్నట్లు తప్పులన్నీ టీయకంలపై వేయడం సరికాదని, అధికారులు వెంటనే నోటీసులు వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. సంఘాలన్నీ ఏకమై ఐక్య కార్యాచరణతో తమకు జరిగే అన్యాయాలపై పోరాడతామని స్పష్టం చేస్తున్నారు.

విధులపై సంజాయిషీ కోరాం

పాఠశాలల్లో నిత్యం జరగాల్సిన పనులు, విధుల గురించి మాత్రమే ప్రశ్నిస్తున్నాము. ఎప్పుడు ఏ పనులు జరగాలో, అవి పూర్తి స్థాయిలో ఎందుకు జరగడం లేదో తమకు తెలియచేయాలని చెబుతున్నాము. ఉపాధ్యాయులు తమ విధులు సక్రమంగా నిర్వర్తించమని చెప్పడం శాఖాపరమైన అంశాలే కానీ మరే ఇతర కారణాలు లేవు. నోటీసులు అందుకున్న వారు కూడా తమను ఏ అంశంపై ప్రశ్నించారో దానిపై మాత్రమే సమాధానం ఇస్తే సరిపోతుంది. ఎవరూ ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- రామారావు, డీఈవో



కావలి : అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వేదిక సభ్యులు

రాప్తాడు ఘటన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి!

- కావలి, చేజర్లలో జర్నలిస్టుల ఆందోళన
- విపక్ష నాయకుల మద్దతు

కావలి, ఫిబ్రవరి 22 : ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిచేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ వేదిక సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం కావలిలోని ట్రంకురోడ్డులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వేదిక సభ్యుడు, కాంగ్రెస్ నేత చింతాల వెంకట్రావు మాట్లాడుతూ విలేకరులపై దాడులు చేయటం ప్రజాస్వామ్యంలో సరికాదన్నారు. టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబూరావు, న్యూడెమోక్రసీ నేత కరువది భాస్కర్, సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య, స్త్రీవిముక్తి సంఘటన నాయకురాలు శ్యామల, జనసేన పట్టణ అధ్యక్షుడు పొబ్బా సాయి, సీపీఐ నాయకుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

● చేజర్ల : మీడియాపై దాడులు చేయడం దుర్మార్గమని ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఏపీఎంపీఏ) జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి సురేష్ పేర్కొన్నారు. గురువారం చేజర్లలో విలేకరులతో కలిసి ఆయన నల్లబ్యాడ్జీలు ధరించి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన వ్యక్తం చేశారు. అనతరం ర్యాలీగా వెళ్లి తహసీల్దారు, పోలీస్‌స్టేషన్లలో వినతిపత్రాలు అందజేశారు. దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో ప్రింట్, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.


చేజర్ల తహసీల్దారు కార్యాలయం వద్ద జర్నలిస్టుల నిరసన

నిర్లక్ష్యం విలువ నిండు జీవితాలు

- వాహనాలను వెనుక నుంచి ఢీకొనే అధిక ప్రమాదాలు
- జిల్లాలో జాతీయ రహదారిపై వరుసగా ఇలాంటివే...
- రేడియం స్టిక్కర్లు అమర్చుకోవడంలో నిర్లక్ష్యం
- పొగమంచు... చీకటితో పెను ప్రమాదాలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 22 : చిన్న చిన్న నిర్లక్ష్యాలు ఎంతో మంది జీవితాన్ని తలకిందులు చేస్తున్నాయి. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు కొన్ని కుటుంబాలను వీధిన పడేస్తున్నాయి. ప్రమాదం జరిగిన సమయంలో నుజ్జయిన వాహనాలు, క్షతగాత్రుల ఆర్తనాదాలు, మృతుల కుటుంబ సభ్యుల రోదన, అధికారుల హడావిడే అందరికీ కనిపిస్తుంటాయి. అయితే ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయి, మంచానికే పరిమితమైన వారి కుటుంబం నిత్యం కన్నీరు పెడుతూనే ఉంటుంది. ప్రధానంగా కుటుంబాన్ని పోషించే పెద్దను కోల్పోయిన ఇంట్లో పరిస్థితులు తారుమారు అవుతాయి. జిల్లాలో జరిగే రోడ్డు ప్రమాదాల్లో అధికంగా, రోడ్డుపైనో.. పక్కనో నిలిపి ఉన్న వాహనాన్నో, ముందు వెళుతున్న వాహనాలనో వెనుక నుంచి వేగంగా ఢీకొనడం ద్వారానే జరుగుతున్నాయి. జిల్లాలో జాతీయ రహదారిపై నిలిపి ఉన్న వాహనాలను వెనుక నుంచి ఢీకొనడం వల్ల వందలాది ప్రమాదాలు జరిగాయి. వీటిలో ప్రాణ నష్టం అధికంగా సంభవించింది. ఇలాంటి ప్రమాదాలు జరగడానికి ప్రధాన కారణం.. ముందు ఉన్న వాహనాలు వెనుక వచ్చే వాహనాల డ్రైవర్‌కు స్పష్టంగా కనిపించక పోవడమే అని పలువురు డ్రైవర్లు, నిపుణులు చెబుతున్నారు. నిబంధనలు పాటిస్తూ వాహనాలకు రిఫ్లెక్టివ్ రేడియం స్టిక్కర్లు అమర్చుకొని ఉంటే ఇలాంటి ప్రమాదాలు జరిగే అవకాశాలు తక్కువగా ఉంటాయి. ముఖ్యంగా రాత్రిపూట, మంచు కురిసే రోజుల్లో, రోడ్డుపై వాహనాలు నెమ్మదిగా వెళుతున్నప్పుడు, నిలిపి ఉన్నప్పుడు... వెనుక వచ్చే వాహనదారులు సమీపానికి వచ్చేంత వరకు ముందున్నవి కనిపించవు. దీంతో వేగంగా వెళుతున్న వాహనాలు ముందు వాటిని ఢీకొంటున్నాయి. జిల్లాలో రోడ్డు ప్రమాదాల గణాంకాలు పరిశీలిస్తే 2021లో 977, 2022లో 894, 2023లో 883 జరిగాయి. ఈ ఏడాది ఇప్పటికి రెండు నెలలు పూర్తికాకముందే పదుల సంఖ్యల్లో రోడ్డు ప్రమాదాలు జరిగాయి.

తప్పని సరిగా స్టిక్కర్లు అతికించాల్సిందే

రహదారులపై ప్రమాదాలను నివారించడంలో రిఫ్లెక్టివ్ స్టిక్కర్లు ప్రధాన భూమిక పోషిస్తాయి. అయితే చాలా మంది వాహనాల యజమానులు రిఫ్లెక్టివ్ స్టిక్కర్లు అతికించడం లేదు. అలాంటి వాహనాలను నిబంధనలు పాటించేంత వరకు అధికారులు నిర్బంధించాలి. ఏఎస్90కు అనుగుణంగా తయారైన రిఫ్లెక్టివ్ టేపులను వినియోగించేలా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది. మహారాష్ట్ర, గుజరాత్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు ఈ నిబంధనలు కచ్చితంగా అమలు చేస్తుండటంతో రాత్రి వేళల్లో జరిగే ప్రమాదాల సంఖ్య అక్కడ గణనీయంగా తగ్గిందని లెక్కలు చెబుతున్నాయి.


ఈ నెల 10వ తేదీన కావలి సమీపంలో ప్రమాదానికి గురై నుజ్జునుజ్జయిన లారీ, బస్సు ముందు భాగాలు (ఫైల్)


ప్రభుత్వ భూమిలో కట్టడాలు

నోటీసులు జారీ చేస్తాం

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు. అయ్యనపల్లిలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కట్టడాలు చేస్తున్న వారికి నోటీసులు జారీ చేస్తాం. అలాగే ఆ ప్రాంతంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తాం.

- శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దారు, దుత్తలూరు

ప్రభుత్వ స్థలమేగా.. వేసేయ్ పాగా!

- యథేచ్ఛగా నిర్మాణాలు.. విలువ రూ.కోటిపైనే

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 22 : రూ.ఒక కోటికిపైగా విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి యథేచ్ఛగా కట్టడాలు చేస్తున్నా రెవెన్యూ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఆ స్థలం పక్కనే మరోవ్యక్తికి చెందిన భూమి ఉండ టంతో ఈ ఆక్రమణ వ్యవహారం వెలుగు చూసింది. ఈ ప్రభుత్వ భూమిని ఇప్పటికే పలువురు వ్యక్తులు స్వాహా చేసేందుకు రంగం సిద్ధం చేశారు. దుత్తలూరు మండలం నందిపాడు పంచాయతీలోని అయ్యనపల్లి రెవెన్యూ పరిధిలో సర్వే నెం.228సీలో మొత్తం 1.17 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ప్రస్తుతం ఆ భూమి రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ కార్యాలయాల కింద చూపుతోంది. ఈ సర్వే నెంబరులో ఉన్న మొత్తం 1.17 ఎకరాల విస్తీర్ణంలో ఒక ఎకరాను గతంలోనే వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయం కింద చూపుతోంది. మిగిలిన 17 సెంట్ల స్థలాన్ని అలాగే వదిలేశారు. నందిపాడు గ్రామం మీదుగా 565 జాతీయ రహదారి ఉండడంతో స్థలాల విలువ భారీగా పెరిగింది. దీంతో అక్రమార్కుల కన్ను ఆ భూమిపై పడింది.

● వెలుగులోకి ఇలా..

ఇటీవల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ప్రభుత్వం స్థలం పక్కనే ఉన్న తన సొంత స్థలానికి సర్వే చేయిస్తుండగా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన వారు అడ్డుకున్నారు. దీంతో ఆ వ్యక్తి సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో రెవెన్యూ అధికారులు ఆక్రమణదారులు నిర్మిస్తున్న కట్టడాలను అడ్డుకోవడంతో ఇది వెలుగుచూసింది. ప్రభుత్వానికి చెందిన ఈ స్థలం సుమారు 15 సెంట్లు ఆక్రమణకు గురైనట్లు స్థానికులు తెలుపుతున్నారు. ప్రస్తుతం మార్కెట్ విలువ ప్రకారం ఆ స్థలం విలువ రూ.కోటికి పై మాటే. అయితే స్థలానికి సంబంధించి పూర్తి ఆధారాలు తమ వద్ద ఉన్నాయని ఆక్రమణదారులు చెప్పడం విశేషం. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

విద్యుత్ కోతలతో ఎండుతున్న వరి

● ఆందోళనలో అన్నదాతలు


విద్యుత్ కోతలతో ఎండిన వరిపైరు

కావలి రూరల్, ఫిబ్రవరి22: మండలంలోని కొత్తపల్లిలో విద్యుత్ కోతలతో వరిపైరు ఎండిపోతున్నా అధికారులు పట్టించుకోవటంలేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. వ్యవసాయానికి 9గంటలు ఉచిత విద్యుత్ ఇస్తున్నట్లు ప్రభుత్వం చెప్పే మాటలు ప్రకటనలకే పరిమితమయ్యాయని వారు వాపోతున్నారు. గ్రామంలో బోర్ల కింద సుమారు 400 ఎకరాల్లో వరిసాగు ఉంది. 20 రోజు లుగా 9 గంటలపాటు విద్యుత్ ఇవ్వకుండా, ఉదయం 8 నుంచి 3 గంటల వరకు మాత్రమే ఇస్తున్నారన్నారని రైతులు తెలిపారు. అది కూడా లోవోల్టేజీ వస్తుండడంతో మోటార్లు కాలిపోతున్నాయన్నారు. నీటి తడులు అందక ఇప్పటివరకు సుమారు 100 ఎకరాల్లో వరి పైరు ఎండిపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

● ఎమ్మెల్యే గారూ మాగోడు పట్టదా?

కరెంటు కోతలతో వరిపైరు ఎండిపోవడాన్ని విద్యుత్ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకు వెళ్లినా, పట్టించుకోవటం లేదని రైతులు వాపోయారు. అయ్యా ... ఎమ్మెల్యే గారూ.. మీరైనా మా గోడు పట్టించుకోరా.. అంటూ వారు వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రైతులకు 9గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలని వారు కోరుతున్నారు. కాగా ఈ విషయమై విద్యుత్ ఏఈ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ గత పదిరోజులుగా ప్రభుత్వం 7 గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా చేస్తున్నదన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు


గంజాయి అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసిన ఎస్ఈబీ అధికారులు

ముత్తుకూరు, ఫిబ్రవరి 22 : మండల పరిధిలోని ఈపూరులో గురువారం గంజాయి అమ్ముతున్న ఒడిస్సా రాష్ట్రానికి చెందిన పాపున్ సహు అనే వ్యక్తిని ఇందుకూరుపేట స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఎస్ శ్రీనివాసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 3కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి జ్యూడీషియల్ రిమాండ్‌కి పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా మత్తు పదార్థాలు అమ్మినా, ఇతర ఎస్ఈబీ నేరాలకు పాల్పడినా చట్టరీత్యా కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సతీష్, కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు తీవ్ర అస్వస్థత


చికిత్స పొందుతున్న డ్రైవర్

మర్రిపాడు, ఫిబ్రవరి 22: బద్వేల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ గంగయ్య నెల్లూరుకు వెళుతుండగా గురువారం మర్రిపాడలో తీవ్ర అస్వస్థతకు గురైయ్యాడు. తన సీటులోని స్టీరింగ్‌లోనే తూలిపోయాడు. గమనించిన కండెక్టర్, స్థానికుల సాయంతో అతన్ని కిందకు దించి హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందజేశారు. డ్రైవర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తెల్లవారుజాము నుండే తనకు ఆరోగ్యం సహకరించలేదంటూ తమ డిపోలో అధికారులను సెలవు కోరాడు. వారు ససేమిరా అంటూ బలవంతంగా డ్యూటీకి పంపారు. అప్పటికే జ్వరం 103, బీపీ 160వున్నది. ఇటీవల గుండె ఆపరేషన్ కూడా చేయించుకున్నారు. బస్సులోని ప్రయాణికులను వేరే బస్సులో పంపించారు.

హోంగార్డ్స్ డీఎస్పీగా సంకురయ్య


బాధ్యతలు చేపట్టిన సంకురయ్య

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 22: జిల్లా హోమ్‌గార్డ్స్ డీఎస్పీగా కే సంకురయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన ఎస్పీ డాక్టర్ కే తిరుమలేశ్వర రెడ్డి, ఏఎస్పీ సీహెచ్ సౌజన్య తదితరులను మర్యాదపూర్వకంగా కలిశారు. పశ్చిమగోదావరి జిల్లా పోలవరానికి చెందిన సంకురయ్య 1996లో ఆర్ఎస్ఐగా పోలీసు శాఖలో బాధ్యతలు చేపట్టారు. నంద్యాల, ప్రకాశం, గుంటూరు, విజయవాడ ప్రాంతాల్లో పని చేశారు. గత నెలలో జరిగిన డీఎస్పీల బదిలీల్లో భాగంగా జిల్లా హోంగార్డ్స్ డీఎస్పీగా పనిచేస్తున్న ఎస్ చంద్రమోహన్ బాపట్ల జిల్లాకు బదిలీ కావడంతో అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంది. విజయవాడలో పనిచేస్తున్న సంకురయ్యను ఆ స్థానంలో నియమించడంతో బాధ్యతలు చేపట్టారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	152
లేయర్ లైవ్	80
స్కిన్ చికెన్	266
స్కిన్‌లెస్	294
లేయర్	136

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5929
వెండి కిలో ధర	రూ. 72,600
వెండి ఒక గ్రాము	రూ. 74.60

టెన్త్, ఇంటర్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు : కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 22 : జిల్లాలో జరిగే పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ ఎం హరినారాయణన్ తెలిపారు. గురువారం విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించి ఆదేశాలి చ్చామని చెప్పారు. జిల్లాలో 81 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తుండగా 52,076 మంది విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. పదో తరగతి పరీక్షలకు 32,384 మంది విద్యార్థులు హాజరవుతుండగా వీరికోసం 176 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలన్నీ కట్టుదిట్టంగా విజయవంతంగా నిర్వహిస్తామన్నారు. ప్రతి ప్రశ్న పత్రం మీద క్యూఆర్ కోడ్ ఉంటుందని, ఆ కోడ్‌లో విద్యార్థి హాల్‌టికెట్ నెంబర్, స్కూల్ పేరు ఉంటాయని, ఆ పేపర్ ఎవరి వద్ద నుంచి లీక్ అయ్యింది, ఏ సెంటర్‌లో జరిగిందో తెలిసిపోతుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఎవరూ కూడా మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడవద్దని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆర్ఐవో డాక్టర్ ఎ శ్రీనివాసులు, డీఈవో రామారావు, డీఎంహెచ్‌వో పెంచలయ్య, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయన్, ఆర్టీసీ డీవీఎం చిరంజీవి, పోస్టల్ అధికారి రాజేష్, మునిసిపల్ అడిషనల్ కమిషనర్ శర్మద తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

నెల్లూరు(హరనాథపురం): భూసమస్యలను పరిష్కరించడానికి సత్వర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. ఆత్మకూరు నియోజకవర్గ సమస్యలపై ఆయన చాంబర్‌లో గురువారం ఆ నియోజవర్గ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డితో కలిసి అధికారులతో సమీక్షించారు. జగనన్నకు చెబుదాం, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమా ల్లో వచ్చిన రెవెన్యూ పరమైన అర్జీలను పరిష్కరించడానికి కృషి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ నియోజవర్గంలో నూతనంగా నియమితులైన తహసీల్దార్లు వివిధ స్థాయిల్లో ఉన్న భూసమస్యలపై ప్రత్యేక శ్రద్ధపెట్టి పరిష్కరించాలని కోరారు ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీవో మధులత, సర్వేశాఖ ఏడీ హనుమాన్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దాసరిపల్లె నుంచి కురుగొండ్ల ప్రచారం


మహిళలకు చీర, సారె ఇస్తున్న వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

కలువాయి, ఫిబ్రవరి 22 : వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ గురువారం కలువాయి మండలం దాసరిపల్లె నుంచి, ఆయన కుమార్తె లక్ష్మీ సాయి ప్రియతో కలసి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఎన్నికల్లో పోటీచేసే ప్రతిసారి ఆయన సెంటిమెంటుగా ఇక్కడ నుంచే ప్రచారం ప్రారంభిస్తారు. ఈసారి కూడా ఆయన పెంచలకోనలో బుధవారం రాత్రి నిద్ర చేసి, గురువారం ఉదయం ముందుగా ఐదిళ్లకు వెళ్లి వారికి చీరలు, సారె, పండ్లు, అందించి మహిళల ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం నాయకులతో కలసి గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడ కూడా వైసీపీ పాలనలో అభివృద్ధి అనే మాటే లేకుండా పోయిందన్నారు. ఎప్పుడు టీడీపీ ప్రభుత్వం వస్తుందా ? చంద్రబాబు సీఎం అవుతారా...అని ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఇసుక, లిక్కర్, మైనింగ్ మాఫియాలు రాజ్యమేలుతున్నాయన్నారు. కురుగొండ్ల వెంట నాయకులు జీ.వెంకటేశ్వర్లునాయుడు, జెన్ని రమణయ్య, జగదల్‌నాయుడు, కిషోర్‌రెడ్డి, రవీంద్ర పలువురు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

బీరంగుంటలో మూడిళ్లలో చోరీ

● నగదు, బంగారు ఆభరణాల అపహరణ


పగలగొట్టిన ఉన్న బీరువా

అల్లూరు, ఫిబ్రవరి 22 : ఒకేరోజు మూడు ఇళ్లల్లో నగదు, బంగారు ఆభరణాల చోరీ జరిగింది. మండలంలో బీరంగుంటలో గురువారం వేకువజామున ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు, బీరంగుంట మిక్స్‌డ్ కాలనీకి చెందిన తిరుమలశెట్టి శ్రీనివాసులు కుటుంబ సభ్యులు నెల్లూరులోని కుమార్తె ఇంటికి వెళ్లారు. గ్రామానికి చెందిన తిరుమలశెట్టి చంద్రమోహన్ కుటుంబ సభ్యులకు బాగాలేక నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా అక్కడికి వెళ్లారు. అలాగే పడమర అరుంధతీయవాడకు చెందిన నిమ్మలకాయల సురేష్ పనుల నిమిత్తం కుటుంబంతో బెంగళూరుకి తరలివెళ్లారు. ఈ మూడిళ్లను గమనించిన దుండగులు ఒకేసారి చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటనలో తిరుమలశెట్టి శ్రీనివాసులు ఇంట్లోని బీరువా, అలమరలు ధ్వంసం చేసి అందులోని రూ1.40 లక్షల నగదు, సవర బంగారు ఆభరణాలు దొంగిలించుకొని వెళ్లారు. మిగిలిన వారి ఇళ్లలో ఏమి చోరీ జరిగాయో కుటుంబ సభ్యులు వచ్చి పరిశీలించి చెప్పాల్సి ఉంది. ఈ ఘటనపై తిరుమలశెట్టి శ్రీనివాసులు పోలీస్‌స్టేషనులో ఫిర్యాదు చేయగా, పోలీసులు సంఘటనా స్థలాలను పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

డిగ్రీ పరీక్షలలో ఇద్దరి డిబార్

వెంకటాచలం, ఫిబ్రవరి 22 : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన డిగ్రీ ఒకటవ సెమిస్టర్ పరీక్షలలో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయినట్లు వర్సిటీ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు 256 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

పది పరీక్షలకు సన్నద్ధం కావాలి : డీఈవో


మాట్లాడుతున్న డీఈవో రామారావు

నెల్లూరు (విద్య): జిల్లాలో మార్చి 18వతేదీ నుంచి జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు సిబ్బంది అందరూ సన్నద్ధం కావాలని డీఈవో రామారావు సూచించారు. గురువారం నగరంలోని ఐఎంఏ హాలులో నెల్లూరు డివిజన్ ఎంఈవో, ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు, సీఎస్‌లు, పరీక్షల విభాగం అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. పరీక్షల నిర్వహణ విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడ ఇబ్బందులు తలెత్తినా శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బలోపేతం కావాలని, పాఠశాల విద్యాశాఖ నిర్వహించిన ప్రతి కార్యక్రమం వివరాలు అందచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు డిప్యూటీ ఈవో ప్రసన్నలక్ష్మీ, డీసీఈవో కార్యదర్శి రామ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇద్దరు బాలికల అదృశ్యం

● ఆచూకీ కోసం తల్లిదండ్రులు, పోలీసుల గాలింపు

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 22: స్థానిక కూరగాయల మార్కెట్ ప్రాంతంలో నివాసముంటున్న ఇద్దరు బాలికలు అదృశ్యమైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు వారితో కలిసి పోలీసులు బాలికల కోసం గాలించి మధ్యాహ్నం జొన్నవాడ ఆలయ పరిసరాలలో వున్న ట్టు తెలుసుకున్నా వారు కనిపించలేదు. హవిష్య(14) ఓ ప్రైవేటు స్కూల్లో 8వ తరగతి చదువుతుండగా, రుహీనా (14) ఖాజానగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతోంది. వీరిద్దరూ మధ్యాహ్నం భోజనం అనంతరం నిహారిక అనే బాలిక వద్దకు వెళ్లి ఎటైనా వెళ్లాలని 500 రూపాయలు అప్పుగా అడిగిన ట్టు చెబుతోంది. కానీ వారు ఎక్కడికెళ్ళిన విషయం తెలీదంటోంది. బాలికల తల్లిదండ్రులు బాలికల కోసం గాలిస్తున్నారు.

అప్పు చెల్లించలేదని వ్యక్తిపై దాడి

కావలిరూరల్: అప్పు చెల్లించలేదని మేడికొండ మాల్యాద్రిపై చాకుతో దాడి చేసి గాయపరిచారు. ఈ సంఘటన గురువారం కావలి బ్రిడ్జిసెంటర్‌లో జరిగింది. బాధితుడి కథనం మేరకు, ముసునూరు ఇందిరమ్మకాలనీకి చెందిన మాల్యాద్రి, కచ్చేరిమిట్టకు చెందిన పేముల రాబర్ట్ వద్ద రూ.10ల వడ్డీకి రూ.30వేల నగదును అప్పుగా తీసుకున్నాడు. వాయిదాల ప్రకారం 15 నెలలు నగదు చెల్లించగా, ఇబ్బందుల కారణంగా మూడు నెలల నగదు చెల్లించలేదు. దీంతో బుధవారం రాత్రి రాబర్ట్ ఫోన్ చేసి ఎక్కడున్నావు డబ్బులు ఎప్పుడిస్తావు.. అంటూ తిప్పకు చెందిన దావీద్‌తో మాట్లాడాలని బెదిరించాడు. గురువారం ఐదు వేలు ఇచ్చి మిగిలిన నగదు ఈనెల 26న ఇస్తానని చెప్పి ఫోన్ పెట్టేశాడు. తర్వాత బ్రిడ్జి సెంటర్‌లో టీ తాగుతుండగా దావీద్ పంపించాడని కచ్చేరిమిట్టకు చెందిన శాంత, మరో వ్యక్తి మోటారు సైకిల్‌పై వచ్చి డబ్బులు ఎప్పుడు ఇచ్చే దంటూ చాకుతో మాల్యాద్రి మెడపై దాడి చేసి అక్కడ నుంచి పరారయ్యారు. గాయ పడిన మాల్యాద్రి కావలి ఏరియా వైద్యశా లలో చికిత్స పొందుతున్నాడు బాధితుడి ఫిర్యాదు మేరకు ఒకటో పట్టణ సీఐ సీ. రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలు

● నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 22 : ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టాన్ని అనుసరించి అన్ని ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ఈనెల 23వతేదీ నుంచి ఆన్‌లైన్‌లో అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎస్ఎస్ఏ ఏపీసీ ఉషారాణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధిత పిల్లలు, దివ్యాంగుల కోసం 5 శాతం, ఎస్సీలకు 10శాతం, ఎస్టీలకు 4శాతం, బీసీ, మైనార్టీ, ఓసీలకు కలిపి 6శాతం సీట్లు కేటాయించామన్నారు. 2024-25 విద్యాసంవత్సరానికి అన్ని ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 1వతరగతిలో చేరేందుకు 25శాతం సీట్లు కేటాయిస్తామన్నారు. దీనిలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లోని బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలకు వార్షిక ఆదాయం రూ.1,20,000, పట్టణ ప్రాంతాల్లోని బలహీన వర్గాల కుటుంబాలకు రూ.1,40,000 ఉండాలన్నారు. ఈ కుటుంబాల్లోని పిల్లలను మాత్రమే అర్హులుగా గుర్తించి ప్రవేశాలు కల్పిస్తామని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు విద్యాశాఖ వెబ్‌సైట్ www.cse.ap.gov.inలో ఈనెల 23 నుంచి మార్చి 14వతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు సమీపంలోని ఎంఈవో కార్యాలయంలోగానీ, టోల్ ఫ్రీ 14417, 18004258599 నెంబర్లనుగానీ సంప్రదించాలని కోరారు.

మద్యానికి బానిసై బలవన్మరణం

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 22 : ఓ వ్యక్తి మద్యానికి బానిసై బలవన్మరణనానికి పాల్పడాడు. రూరల్ పోలీసులు అందించిన వివరాల మేరకు... రూరల్ పరిధిలోని కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు కాలనీ (ఎంఐజీ)లో ప్రతాప్‌సింగ్ (61) జీవిస్తున్నాడు. ఆయన ప్రైవేటుగా పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. భార్య హైదరాబాద్‌లో ప్రైవేట్ వార్డెన్‌గా పని చేస్తుండగా ఇద్దరు ఆడపిల్లలు పెళ్లిలు చేసుకుని బయట ప్రాంతాల్లో నివసిస్తున్నారు. ఒక్కడే ఇంట్లో ఉంటూ మద్యానికి బానిసైన ప్రతాప్‌సింగ్ డబ్బు లేదనే వేదనతో బుధవారం రాత్రి ఇంట్లోనే ఉరేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇంటి యజమాని ఇచ్చిన ఫిర్యాదుతో గురువారం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

మోటార్లకు మీటర్లు.. రైతుల మెడకు ఉరితాళ్లు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 22: వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే రైతు మెడకు ఉరితాళ్లు బిగించడమేనని, ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలో పాల్గొని మాట్లాడారు. వ్యవసాయరంగానికి సక్రమంగా విద్యుత్ సరఫరా ఇవ్వక పోవడంతో పంటలు ఎండుదశకు చేరాయని వాపోయారు. ఏడు గంటల సరఫరాలోనూ అంతరాయాలు ఏర్పడటం విచారకరం అన్నారు. భూ సమస్యల విషయంలో రైతులు న్యాయస్థానాలను ఆశ్రయించకుండా రెవెన్యూ అధికారులే సమస్యలు పరిష్కరించేలా చట్టబద్ధత చేయడం దారుణమన్నారు. రాజకీయ నాయకులు, భూస్వాములు అధికారులను లోబర్చుకొని సన్న, చిన్న కారు రైతులను ఇబ్బందులకు గురి చేస్తారని ఆరోపించారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘం నాయకులు

సచివాలయాల తనిఖీ


సూచనలిస్తున్న ఎంపీడీవో తాజ్ మస్రూర్

అనంతసాగరం, ఫిబ్రవరి 22: మండలంలోని లింగంగుంట సచివాలయాన్ని గురువారం ఎంపీడీవో తాజ్‌మస్రూర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఆరోగ్యసురక్ష క్యాంపు సర్వే, ఆయుష్మాన్‌భారత్, ఆరోగ్యశ్రీ కార్డుల జారీ మరియు ఎన్రోల్మెంట్, వివిధ పథకాల అమలుతీరుపై సమీక్షించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. విధినిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు ఉంటాయని సిబ్బందికి హెచ్చరించారు.

ఉదయగిరి: మండలంలోని నేలటూరు, కృష్ణంపల్లి సచివాలయాలను గురువారం ఎంపీడీవో ఈశ్వరమ్మ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ త్వరగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచిం చారు. వివిధ సమస్యలపై వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చ రించారు.

మట్టి నమూనాల సేకరణపై విశ్లేషణ

మర్రిపాడు, ఫిబ్రవరి 22: నవోదయ విద్యాలయంలో వ్యవసాయాధికారి బి.జ్యోత్స్న గురువారం మట్టి నమూనా సేకరణపై విద్యార్థులకు విశ్లేషణ చేశారు. ఆత్మపథకం ద్వారా ఈ అవగాహన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. భూసార ప్రాముఖ్యత, తద్వారా పంట దిగుబడులను మరియు మట్టి నమూనా సొంతంగా సేకరించటం, ప్రయోగశాలలో విశ్లేషించటం, ఎన్‌పికే, సేంద్రియ కర్బనం, సూక్ష్మపోషకాలు విశిష్టతను గురించి ఆత్మ పీడి జి.శివనారాయణ వివరించారు. కార్యక్రమంలో రామ్మోహన్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు తదిదితరులు వున్నారు.

ఫ్యామిలీ వైద్యుల సేవలు సద్వినియోగం చేసుకోండి

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 22: గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో 104 వాహనం ద్వారా అందించే ఫ్యామిలీ వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారిణి శివకల్పన తెలిపారు. గురువారం పట్టణంలోని సచివా లయం-1 పరిధిలోని స్థానికులకు వైద్యసేవలందించారు. ఈ సందర్భంగా 55 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. దీర్ఘకాలిక రోగులకు నెలకు సరిపడా మందులు ఇచ్చారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శివకుమారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఉదయగిరి, ఫిబ్రవరి 22: అంగన్‌వాడీ కార్యకర్తలు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సీడీపీవో పచ్చవ లావణ్య హెచ్చరించారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలతో సమావేశం అయ్యారు. కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధుల్లో ఉండాలన్నారు. ప్రతిరోజు మెనూ ప్రకారం భోజనం వడ్డించాల..కేంద్రాల్లో పరిశుభ్రతను పాటించాల న్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు తేజస్విని, రత్న పాల్గొన్నారు.

ఎట్టకేలకు బాధ్యతల స్వీకరణ

వరికుంటపాడు, ఫిబ్రవరి 22: మండల తహసీల్దారుగా కె.అరుణాదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఉన్న తహసీల్దారు ఇటీవల సస్పెన్షన్‌కు గురి కావడంతో ఆయన స్థానంలో కొండాపురం తహసీల్దారుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆపై ఎన్నికల బదిలీల్లో భాగంగా నరసారావుపేట నుంచి వచ్చిన చంద్రారెడ్డి ఈ నెల 7న బాధ్యతలు స్వీకరించారు. అనంతరం తనదైన శైలిలో పావులు కలిపి ఆయన అనతి కాలంలోనే కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయానికి బదిలీ చేయించుకొని వెళ్లారు. ఆయన స్థానంలో అదే కార్యాలయంలో డీఏవో విధులు నిర్వర్తిస్తున్న ఆమె ఇక్కడకు బదిలీపై వచ్చారు. కాగా ఇక్కడి రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా ఆమె ఎంతమేర విధులు నిర్వర్తిస్తారోనని సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

ఈవీఎం, వీవీ ప్యాడ్‌లపై అవగాహన

సీతారామపురం, ఫిబ్రవరి 22: స్థానిక డిగ్రీ కాలేజ్, హరిజనవాడలో గురువారం నియోజకవర్గ చీఫ్ నోడల్ ఆఫీసర్ బాలకేశవులు స్థానికులకు ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈవీఎం, వివి ప్యాడ్స్‌పై ఓటు వేసే విధానాన్ని తెలిపారు. కార్యక్రమంలో డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, చీఫ్ అసిస్టెంట్ నోడల్ ఆఫీసర్ ఖాజారంతుల్లా, ఈవీఎం అవేర్నెస్ ఆఫీసర్ శ్రీనాథ్ రెడ్డి, ఏపీఎం సుధాకర్ పాల్గొన్నారు.

పాడి రైతులకు అవగాహన


పాడి రైతుతో మాట్లాడుతున్న పశువైద్యాధికారులు

సంగం, ఫిబ్రవరి 22: స్థానిక పశువైద్య కేంద్రంలో గురువారం పాడి రైతులకు పశువిజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. పశు వైద్యాధికారుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తక్కువ ఖర్చుతో అధిక పాల దిగుబడి సాధించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. పాడి రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అదేవిధంగా ఇటీవల కొన్ని ప్రాంతాల్లో కోళ్లకు వ్యాపించిన బర్డ్‌ఫ్లూ వ్యాధిపై తీసుకోవలసిన జాగ్రత్తలు తెలిపారు. కార్యక్రమంలో ఏడీ జయచంద్ర, పశు వైద్యాధికారి సురేష్ బాబు, పలువురు పాడి రైతులు పాల్గొన్నారు.

రెగ్యులర్ వీఆర్‌వో లేక ఇక్కట్లు

లింగసముద్రం, ఫిబ్రవరి 22 : లింగసముద్రం గ్రామానికి రెగ్యులర్ వీఆర్‌వో లేక గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు.ఇక్కడ వీఆర్‌వోగా ఉన్న గోవిందరాజులు బదిలీపై వెళ్లిపోయారు.దీంతో అప్పటి నుంచి పెదపవని వీఆర్‌వో షేక్ మస్తాన్‌వలి ఇన్‌చార్జ్ వీఆర్‌వోగా ఉన్నారు. కొంతకాలానికి మస్తాన్‌వలిని చీమలపెంట, రాళ్లపాడు గ్రామాలకు ఇన్‌చార్జ్ వీఆర్‌వోగా నియమించారు. ప్రస్తుతం మాలకొండరాయునిపాలెం వీఆర్‌వో షేక్‌జకీరా లింగసముద్రం ఇన్‌చార్జి వీఆర్‌వోగా పనిచేస్తున్నారు. తనను జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ కోసమే నియమించారని ఆమె తెలిపారు. ఈ విషయమై తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జి శ్రీచరణ్ చెప్పారు. లింగసముద్రం గ్రామానికి ఇకనైనా రెగ్యులర్ వీఆర్‌వోను నియమించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతిదేవి పూజ



ప్రత్యేక అలంకరణలో సరస్వతిదేవి, పూజల్లో పాల్గొన్న విద్యార్థులు

సంగం, ఫిబ్రవరి 22: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు గురువారం భక్తిశ్రద్ధలతో సరస్వతిదేవి పూజలు న్విహించారు. త్వరలో జరగబోవు పది, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించాలని విద్యార్థులను ఉపాధ్యాయులు ఆశీర్వదించారు. మధ్యాహ్నం నుంచి విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉల్లాసంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బుజ్జయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి


సిబ్బందికి సూచనలిస్తున్న వైద్యాధికారి శివకల్పన

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 22: వచ్చేనెల 3, 4, 5వ తేదీల్లో జరిగే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైద్యాధికారులు శివకల్పన, వినీతలు తెలిపారు. గురువారం స్థానిక పాత సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, పర్యవేక్షకులకు ఇర్వహించిన శిక్షణలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమ నిర్వహణకు నియమించిన సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. మండలాన్ని ఐదు రూట్లుగా విభజించి 52 పల్స్‌పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసి 206 మంది సిబ్బందిని నియమించామన్నారు. మండలంలో 0-5 ఏళ్ల నిండిన వారు 3,451 మంది ఉన్నారన్నారు. తల్లిదండ్రులు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శివకుమారి, హెచ్‌ఈ వెంకటసుబ్బయ్య, ఆరోగ్య పర్యవేక్షకుడు చెన్నయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఆంజనేయుడి విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ



ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ, పాల్గొన్న భక్తులు

సంగం, ఫిబ్రవరి 22: మండలంలోని దువ్వూరులోని పంచాయతీ స్థలంలో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనకు గురువారం గ్రామస్తులు భూమిపూజ నిర్వహించారు. వేద పండితులు ఆధ్వర్యంలో సర్పంచు మారెళ్ల కృష్ణమ్మ ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

ఏఎస్ పేట, ఫిబ్రవరి 22: స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయలంలో గురువారం ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మమ్మ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థినులు సరస్వతి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు బిఎస్‌ఆర్ ఆసుపత్రి నిర్వాహకురాలు షకీలా సహకారంలో 10, ఇంటర్ విద్యార్థినులకు ప్యాడ్స్‌,పేన్స్, ఇతర సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ సాదిక్ హుసేన్, ఎన్జీవో శ్రీహరి పాల్గొన్నారు.


విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న రెడ్‌క్రాస్ చైర్మన్ సాదిక్ హుసేన్

ఎండను భరించలేక..


ఉదయగిరి మండలంలోని దాసరిపల్లి గ్రామ సమీపంలోని జాతీయ రహదారి సమీపంలో భానుడి దెబ్బకు తట్టుకోలేక మూగజీవాలు ఓ చెట్టు నీడన ఎలా సేదతీరుతున్నాయో.. చూడండి. ఫిబ్రవరిలోనే ఎండలు ఇలా ఉంటే మార్చిలో పరిస్థితి ఎలా ఉంటుందో అని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. - ఉదయగిరి రూరల్

వేమిరెడ్డిని కలిసిన టీడీపీ నేతలు

కందుకూరు, ఫిబ్రవరి 22: నియోజకవర్గ టీడీపీ నేతలు గురువారం నెల్లూరులో రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు మాజీమంత్రి పొంగూరు నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి, ఇతర టీడీపీ నేతలతో కలిసి వేమిరెడ్డిని కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా స్థానిక నేతలను వేమిరెడ్డికి పరిచయం చేసి నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులను వివరించారు. కార్యక్రమంలో నాయకులు చల్లా శ్రీనివాస రావు, దామా మల్లేశ్వరరావు, జనిగర్ల నాగరాజు, నార్నె రోశయ్య, మాదాల లక్ష్మీనరసింహ్మం తదితరులు పాల్గొన్నారు.

● వేమిరెడ్డితోనే ప్రయాణం

వరికుంటపాడు : రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితోనే తన రాజకీయ ప్రయాణం సాగుతుందని అధికార పార్టీకి చెందిన జడ్పీటీసీ సభ్యుడు రావిళ్ల నాగేంద్ర తెలిపారు. గురువారం వేమిరెడ్డితో జరిగిన భేటీలో రాజకీయ భవిష్యత్తుపై నిర్ణయం తీసుకొనే రీతిలో చర్చలు సాగించారు.


వేమిరెడ్డిని సత్కరిస్తున్న ఇంటూరి నాగేశ్వరరావు, ఇతర నేతలు

● వేమిరెడ్డిని కలిసిన చెంచలబాబు

ఉదయగిరి రూరల్ : రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గురువారం నెల్లూరులోని ఆయన నివాసంలో టీడీపీ రాష్ట్ర నేత పీ చెంచల బాబుయాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

నేత్రానందంగా శ్రీవారి తెప్పోత్సవం


తెప్పపై ఊరేగుతున్న శ్రీవారు

కావలిటౌన్, ఫిబ్రవరి22: ముసునూరులోని హనుమత్ క్షేత్రంలో వెలసి ఉన్న శ్రీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారికి గురువారం రాత్రి నిర్వహించిన తెప్పోత్సవం నేత్రానందంగా సాగింది. ఉదయం ఆలయ వ్యవస్థాపక అర్చకులు వేదగిరి సూర్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి శ్రీవారిని ఆలయం నుంచి బాణసంచా కాల్చుతూ, కోలాటాలు, బ్యాండ్ మేళాల మధ్య మందాడి చెరువు వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ కనుల పండువగా తెప్పోత్సవం నిర్వహించారు. వేలాదిగా భక్తులు పాల్గొన్నారు.

ల్యాంకో గ్రూపు ప్రతినిధి రాక

కావలిటౌన్, ఫిబ్రవరి22: మద్దూరుపాడులోని డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలను గురువారం ఖతార్‌లోని ల్యాంకో గ్రూప్ ప్రతినిధి అశోక్‌రాజు సందర్శించారు. డీబీఎస్ కార్యదర్శి దామిశెట్టి బాలసురేష్‌బాబు, ప్రిన్సిపాల్ టీవీ రావులు తదితరులు అశోక్‌రాజు కుటుంబ సభ్యులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఖతార్‌లోని ల్యాంకో గ్రూపుతోపాటు వివిధ కంపెనీల్లో మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొండాపురంలో సరస్వతి పూజ

కొండాపురం, ఫిబ్రవరి22: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ప్రిన్సిపల్ ఎం.శ్రీహరి ఆధ్వర్యంలో సరస్వతి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 1 నుంచి జరగబోయే పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించి ఇటు కళాశాలకు అటు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను కోరారు. అలాగే 100 శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులను ఆయన అందచేశారు.

కొనసాగుతున్న పోలీసు పహారా

లింగసముద్రం, ఫిబ్రవరి 22 : మండలంలోని పెదపవని లో ఓ వివాదాస్పద స్థలంలో గది కట్టే విషయమై ఇరువర్గాల మధ్య వివాదం ఏర్పడింది. దీంతో ఆ స్థలం వద్ద పంచాయతీ కార్యదర్శి, పోలీసులు గురువారం కూడా కాపలా కాస్తున్నారు.గ్రామంలోని సర్వే నంబరు 439/1లో ఓ వ్యక్తి బుధవారం సాయంత్రం గది కట్టేందుకు ప్రయత్నించాడు. మైనార్టీలు అడ్డుకుని ఈ స్థలం తమ పీర్ల చావిడికి చెందిన స్థలమన్నారు. ఈ స్థలం తనదని, పీర్లచావిడికి సంబంధం లేదని ఆ వ్యక్తి వాదనకు దిగారు.దీంతో ఇరువర్గాల మధ్య వాదనలు జరిగాయి. విషయం తెలిసిన అధికారులు ఎస్సై ఎం బాజీబాబుకు సమాచారం ఇచ్చారు. దీంతో వెంటనే ఎస్సై ఆ స్థలం వద్దకు వెళ్లి ఇరువర్గాలకు సర్దిచెప్పి చెప్పారు.అనంతరం పోలీసులను అక్కడ కాపలా ఉంచారు.

190 సీసాల మద్యం పట్టివేత



పట్టుబడ్డ మద్యం సీసాలతో ఎస్ఐ, సిబ్బంది

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 22 : మూడు చక్రాల మోటారుబైకుపై తీసుకెళ్తున్న 190 మద్యం సీసాలను గురువారం ఎస్ఐ బాలమహేంద్రనాయక్ తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. ఈ సంఘటన మండలంలోని మొగిలిచెర్లకు వెళ్లే మూడు రోడ్ల కూడలిలో జరిగింది. లింగసముద్రం మండలం మొగిలిచెర్ల పంచాయతీ బుర్రారెడ్డిపాలెంకి చెందిన వెన్నపూస వెంకటేశ్వర్లు మూడు చక్రాల మోటారుబైకుపై ప్రభుత్వం మద్యం దుకాణం నుంచి అక్రమంగా 190 మద్యం సీసాలను తీసుకెళ్తుండగా ఎస్ఐ తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. వాటిని స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేశామని చెప్పారు.

అమర ఆశయాలు నెరవేర్చుతాం

బిట్రగుంట, ఫిబ్రవరి 22: స్వర్గీయ బచ్చు అమర ఆశయాలను నెరవేర్చుతామని ఆమె తమ్ముడు, ప్రవాస భారతీయుడు బచ్చు కృష్ణకుమార్, సంధ్య అన్నారు. బోగోలులోని సాయిమందిరంలో గురువారం రాత్రి కృష్ణకుమార్ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆనందసాగర్, గోపిశెట్టి వెంకయ్య, ట్రస్ట్ సభ్యులు బీ.సుధాకర్, హరిబాబు, తోటపల్లి సాగర్, సాయి సేవకులు విజయ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

● సాయినాథుడికి ప్రత్యేక పూజలు

బోగోలు రాజావీధిలోని షిర్డీ సాయినాథుడికి గురువారం ప్రత్యేక పూజాభిషేకాలు నిర్వహించారు. అమరా బచ్చు ట్రస్ట్ అధినేతలు కృష్ణకుమార్- సంధ్య దంపతుల తరఫున వేణుగోపాల్-లక్ష్మి దంపతులు అభిషేక, అన్నసంతర్పణ ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పలువురు టీడీపీలో చేరిక

కావలి, ఫిబ్రవరి 22 : మాజీ కౌన్సిలర్ బిట్రగుంట శివ తోపాటు పలు వార్డులకు చెందిన వైసీపీ నాయకులు గురువారం టీడీపీలో చేరారు. ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో పార్టీలో చేరిన వైసీపీ నేతలకు ఇన్‌చార్జి కావ్య క్రిష్ణారెడ్డి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అలాగే 5,6,7 వార్డులకు చెందిన యువత, వైసీపీ యువనాయకుడు జనిగర్ల మనోహర్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్, లీగల్‌సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోట్లూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. కాగా 33వ వార్డుకు చెందిన వైసీపీ నాయకుడు ఘట్టం శ్రీను కూడా టీడీపీలో చేరారు. ఆ వార్డులో జరిగిన కార్యక్రమంలో కావ్య క్రిష్ణారెడ్డి వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు జ్వాలా సుబ్రహ్మణ్యం, జ్వాలా చంద్రశేఖర్, కర్నాటి సుబ్బారావు, పట్నం శివ, ఘట్టం సుబ్బారావు, శ్రీహరి రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.


కావ్య క్రిష్ణారెడ్డితో మాజీ కౌన్సిలర్ శివ

● 2వ వార్డులో బాబు ష్యూరిటీ..

కందుకూరు : పట్టణంలోని 2వ వార్డు ఉర్దూ స్కూల్ ప్రాంతంలో గురువారం సాయంత్రం టీడీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, షేక్ నాగూర్, కూనం నరేంద్ర, యర్రా మునలయ్య, మల్లికార్జున, ఖాదర్‌బాషా, రఘు తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి నోటీసా ? : చింతాల

కావలి, ఫిబ్రవరి22: పోలీసులు అర్ధరాత్రి తలుపులు తట్టి ఎలాంటి స్టాంపులేని నోటీసు తీసుకువచ్చి తన ఇంటి ముందు హడావిడి చేయటం ఏమిటని కావలి కాంగ్రెస్ ఇన్‌చార్జి చింతాల వెంకట్రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీనియర్ న్యాయవాదినన్న గౌరవం కూడా లేకుండా పోలీసులు ప్రవర్తించిన తీరు బాగాలేదన్నారు. దీంతో సీఐపై కోర్టులో రిట్‌పిటిషన్ వేయనున్నట్లు చెప్పారు. వెలగపూడి సచివాలయ ముట్టడికి వెళ్లకుండా నోటీసులు ఇచ్చామని పోలీసులు చెప్పారన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎల్. సురేష్‌బాబు తదితరులు మాట్లాడారు. సమావేశంలో కాంగ్రెస్ నేతలు అనుమలశెట్టి వాసు, గుమ్మా మానస, మధు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చింతాల వెంకట్రావు తదితరులు

వలంటీర్లదే కీలకపాత్ర

అల్లూరు, ఫిబ్రవరి 22 : రానున్న ఎన్నికల్లో కీలకంగా వ్యవహరిచాల్సింది వలంటీర్లేనని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. అల్లూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం వలంటీర్ల అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీన పింఛను అందించినట్లుగా, ఎన్నికల రోజున ప్రతి ఒక్కరి చేత జగనన్న ప్రభుత్వానికి ఓటు వేయించే ప్రక్రియను చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా సేవా వజ్ర, సేవా రత్న, తదితర ప్రోత్సాహకాలను వారిని అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ డీ శశిరేఖ, తహసీల్దారు దుర్గేశ్వరరావు, ఎంపీడీవో జ్యోతి, నాయకులు బీద రమేష్, బిట్రగుంట రమేష్‌రెడ్డి, ఉస్మాన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

జనసేన కార్యాలయం ప్రారంభం

గుడ్లూరు, ఫిబ్రవరి 22 : గుడ్లూరులో గురువారం జనసేన పార్టీ కార్యాలయాన్ని కందుకూరు నియోజకవర్గ జనసేన నాయకులు దేవళ్ల భాస్కర్‌రావుతోపాటుగా మరికొందరు కలిసి ప్రారంభించారు. తొలుత జనసేన నాయకులు సినిమాహాల్ సెంటర్ నుంచి ప్రదర్శనగా వచ్చి బస్టాండ్ సెంటర్‌లోని శ్రీపొట్టి శ్రీరాములు, గాంధీజీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కార్యాలయాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో దేవళ్ల భాస్కర్ రావు మాట్లాడుతూ టీడీపీ- జనసేన కూటమికి ప్రజల్లో అదరణ మరింతగా పెరిగిందన్నారు. అనంతరం మండలంలోని చినలాటవరపికి, వెంకంపేటకు గ్రామాలకు చెందిన 12 కుటుంబాలవారు జనసేనలో చేరారు. తదుపరి చినలాటవరపిలో జనసేన జెండా ఆవిష్కరణ నిర్వహించారు. కార్యాక్రమంలో చిట్టెం ప్రసాద్, ముత్యాల కళ్యాణ్, కొనిదెన శ్రీనివాసులు, గోకరాజు మదన్, ఇనకొల్లు శ్రీనివాసులు, మూలగిరి శ్రీనివాసులు, అన్నంగి చలపతి తదితరులు పాల్గొన్నారు.


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జనసేన నేతలు

పొగాకు క్యూరింగ్‌లో మెలకువలు పాటించాలి

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 22 : పొగాకు క్యూరింగ్‌లో మెలకువలు పాటించాలని కందుకూరు 2వ వేలం కేంద్రం నిర్వహణాధికారి రాజ్‌గోపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని శింగమనేనిపల్లెలో రేకలలోని క్యూరింగ్ అయిన పొగాకు నాణ్యతను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రేడింగ్ సమయంలో రైతులు మెలకువలు పాటించాలన్నారు. పంటకు వచ్చిన ఆకులనే రెలపాలని తెలిపారు. కార్యక్రమంలో సీటీఆర్‌ఐ ప్రతినిధి దివ్యశ్రీ, రామాంజనేయులు, శ్రీనివాస్ రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల అరెస్టు

కందుకూరు, ఫిబ్రవరి 22: రాష్ట్ర సచివాలయం ముట్టడికి వెళ్తున్న కందుకూరు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకురాలు చిలకపాటి సుశీలను విజయవాడలో పోలీసులు అరెస్టు చేశారు. ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకుని సూర్యారావుపేట పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు గురవారం కాంగ్రెస్ నేతలు ఒక ప్రకటనలో తెలిపారు.

అటవీ భూముల ఆక్రమణ

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 22: మండలంలోని కొంతమంది అటవీ భూములను ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. మండలంలోని అయ్యవారిపల్లె, చుండి, మాలకొండ రామలింగాపురం, పోలినేనిచెరువు, గరుకుపాలెం, పెద్దఅమ్మపాలెం, వీరన్నపాలెం, వలేటివారిపాలెం, లక్ష్మక్కపల్లె గ్రామాల్లో 10,918.26 ఎకరాల అటవీ భూములు ఉన్నాయి. అందులో సుమారు 3 ఎకరాలకు పైగానే ఆక్రమణలకు గురైనట్లు తెలుస్తోంది. ఈ భూముల్లో బోర్లు వేసి పొగాకు, మిర్చి, మినుము, కంది, ఉలవ, ఇతర ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. అంతేకాక అడవుల్లోని వృక్ష సంపదను కొల్లగొట్టి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని అటవీ భూములను కాపాడాలి.


అటవీ భూములు ఆక్రమించి సాగు చేసిన పొగాకు

చంద్రబాబును ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యం

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి



కోవూరు: వృద్ధురాలితో మాట్లాడుతున్న దినేష్‌రెడ్డి

కోవూరు, ఫిబ్రవరి 22: చంద్రబాబును రాష్ట్ర ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యం అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అన్నారు. వేగూరులో గురువారం 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత చేపట్టబోయే పథకాలను వివరిస్తూ ఆయన ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇంతా మల్లారెడ్డి, చెముకుల కృష్ణచైతన్య, వేగూరు సుబ్బానాయుడు, సింగారపు లక్ష్మీనరసారెడ్డి, ఉయ్యూరు వేణు పాల్గొన్నారు.

టీడీపీ విజయానికి కలిసికట్టుగా పనిచేద్దాం : కురుగొండ్ల

రాపూరు(డక్కిలి): రానున్న ఎన్నికలలో టీడీపీ విజయానికి కలిసికట్టుగా పనిచేసి చంద్రబాబునాయుడుని సీఎంగా గెలిపించుకుందామని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పిలుపునిచ్చారు. గురువారం ఆయన పెంచలకోన నరసింహస్వామిస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాటాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అరాచకపాలన సాగిస్తోందని, టీడీపీ ప్రభుత్వంలోనే పేదల అభివృద్ధి, సంక్షేమం జరిగిందన్నారు. అనంతరం కలువాయి మండలం దాసరిపల్లిలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో పులికొల్లు రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్‌నాయుడు, వెంకటేశ్వర్లురెడ్డి, రాఘవరెడ్డి, శివరామకృష్ణ, రామచంద్రయ్యనాయుడు, కాపా శ్రీనివాసులునాయుడు, సోమయ్య, సత్యం, విశ్వనాధనా యుడు, కోటేశ్వరరెడ్డి, చెలికం భాస్కర్‌రెడ్డి, చంద్రమౌళిరెడ్డి, రమేష్, సీసీనాయుడు, చంద్రారావు, పీపీచౌదరి పాల్గొన్నారు.

కంటైనర్ టెర్మినల్ తరలిపోతే బతుకులు దుమ్ముపాలే

ముత్తుకూరు : కృష్ణపట్నం కంటైనర్ టెర్మినల్ తరలిపోతే ప్రజల బతుకు దుమ్ముపాలేనని టీడీపీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విమర్శించారు. ముత్తుకూరులో గురువారం బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధన దాహం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇంటింటికీ తిరుగుతూ టీడీపీ చేపట్టబోయే సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నీలం మల్లికార్జునయాదవ్, తెలుగు యువత అధ్యక్షుడు ఈపూరు మునిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు బొలిగర్ల శ్రీనివాసులు, నాయకులు ఏడుకొండలు, కోదండయ్య, తదితరులు పాల్గొన్నారు.



వేమిరెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న హరికుమార్‌రెడ్డి

వేమిరెడ్డిని కలిసిన నాయకులు

ఇందుకూరుపేట, ఫిబ్రవరి 22: వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వైసీపీ రాజ్యసభకు, జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేయడంతో కోవూరు నియోజకవర్గం జనసేన పరిశీలకుడు గుడి హరికుమార్‌రెడ్డి తన ముఖ్య అనుచరులతో గురువారం వేమిరెడ్డి నివాసంలో కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, కోవూరు నియోజకవర్గం చిరంజీవి యువత, పవన్ కల్యాణ్ యువత అధ్యక్షులు లోకేష్, శ్రీకాంత్, బుచ్చి మాధవ్, మోహన్‌రెడ్డి, మాధవ్‌రెడ్డి, వెంకీ, అశ్వక్, ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల ఆర్థిక స్వావలంబనే టీడీపీ లక్ష్యం

● మాజీ మంత్రి పొంగూరు నారాయణ



తోపుడుబండ్లను పంపిణీ చేస్తున్న నారాయణ

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 22 : నిరుపేదల ఆర్థిక స్వావలంబనే టీడీపీ లక్ష్యమని మాజీ మంత్రి, టీడీపీ నేత పొంగూరు నారాయణ తెలిపారు. గురువారం 6వ డివిజన్‌లో చిరు వ్యాపారులకు ఉచితంగా తోపుడు బండ్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ తోపుడు బండ్ల వల్ల కాస్తంత ఆర్థిక ప్రయాజనం చేకూరుతూ వారి కుటుంబానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. చంద్రబాబు అకాంక్షల మేరకు నిరుపేదల ఆదాయం పెరిగేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వ్యాపారులు నారాయణకు ధన్యవాదాలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నగర అభివృద్ధే నారాయణ ధ్యేయం : రమాదేవి

నెల్లూరు నగర అభివృద్ధే పొంగూరు నారాయణ ధ్యేయమని నారాయణ సతీమణి రమా దేవి వెల్లడించారు. ఆమె 43వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి టీడీపీని గెలిపించాలని కోరారు. పార్టీ మేనిఫెస్టో కరపత్రాలు పంచిపెట్టారు. ప్రత్యేకించి ముస్లింలకు నారాయణ పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు జాఫర్ షరీఫ్, ఫాజియా, ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు అవార్డుల ప్రదానం



మెడల్స్ అందుకున్న వలంటీర్లతో మంత్రి కాకాణి

వెంకటాచలం, ఫిబ్రవరి 22: మండలంలోని చెముడుగుంట సమీపంలో ఉన్న శ్రిడ్స్ కల్యాణ మండపంలో గురువారం ఉదయం వలంటీర్లకు అభినందన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొని వాలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులు, ప్రశంసా పత్రాలను అందచేశారు. అలాగే సాయంత్రం యువ కెరటం కార్యక్రమం నిర్వహించారు. తొలుత మోటార్ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ సాంబశివారెడ్డి, చీఫ్ ట్రైనర్ మేధా చిరంజీవి, పలువురు వైసీపీ నాయకులు, వివిధ శాఖల అధికారులున్నారు.

సైదాపురం : స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో గురువారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ వలంటీర్లను సన్మానించే అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి సుధాకర్, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఏవో పురుషోత్తం శివకుమార్, వైసీపీ మండల కన్వీనర్ మన్నారపు రవికుమార్, వైస్ ఎంపీపీ తిరకాల భాస్కర్,మండల ప్రజాప్రతి నిధులు పాల్గొన్నారు.

కస్తూర్బా గాంధీకి ఘన నివాళి

ఇందుకూరుపేట, ఫిబ్రవరి 22: మహాత్మాగాంధీ సతీమణి కస్తూర్బా గాంధీ వర్ధంతి కార్యక్రమం మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో కోకన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో గురువారం జరిగింది. ఈసందర్భంగా ఆయన కస్తూర్బాగాంధీ చిత్రపటానికి నూలుమాలలు సమర్పించి నివాళుల ర్పించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ విద్యార్థులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

రేపు తిరు కల్యాణ మహోత్సవం

పొదలకూరు, ఫిబ్రవరి 22 : పట్టణంలోని శ్రీభగవాన్ వెంకయ్య స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి తిరు కల్యాణ మహోత్సవం శనివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు కృష్ణమోహనాచార్యులు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు తిరుమంజనం, సాయంత్రం 6గంటలకు తిరు కల్యాణ మహోత్సవం, రాత్రి 9గంటలకు అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు. కల్యాణ మహోత్సవానికి వచ్చిన భక్తులకు శ్రీవారి కల్యాణ తలంబ్రాలు, పసుపు కుంకుమ ఇవ్వనున్నట్లు తెలిపారు.

మార్చి 8 నుంచి అంతర్ జిల్లాల చెడుగుడు పోటీలు

కోవూరు, ఫిబ్రవరి 22: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మార్చి 8, 9, 10 తేదీల్లో అంతర్ జిల్లాల పురుషుల చెడుగుడు ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి జూగుంట విజయానందం, ఉపాధ్యక్షుడు పూండ్ల జాన్సన్ తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టును ఈనెల 25న జడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఎంపికచేయనున్నట్లు వివరించారు. పోటీల్లో పాల్గొనే యువకులు ఆధార్‌కార్డులు తీసుకురావల్సిందిగా కోరారు. వివరాలకు ఫోన్ నెంబర్లు 9951297481, 9494290199తో సంప్రదించాలని కోరారు.

టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు పోలంరెడ్డి పరామర్శ



మృతుల కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

కొడవలూరు ఫిబ్రవరి 22: మండలంలో యల్లయపాళెం గ్రామంలో టీడీపీ కార్యకర్తలు పప్పు సుబ్బమ్మ, జాఫర్, పరందామయ్యలు ఇటీవల అనారోగ్యం తో మృతిచెందారు. గురువారం వారి కుటుంబ సభ్యులను మాజీ శాసనసభ్యుడు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, కేతూ వెంకటరమణారెడ్డి, బడుగు శ్రీనివాసులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 22: ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని జిల్లా కోఆర్డినేటర్ మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం బుచ్చి నగర పంచాయతీలోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువకేంద్రం, ఎన్‌వీకే ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటరు అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఓటు అనే ఆయుధం ప్రతి విద్యార్థి బంగారు భవిష్యత్తు, దేశ అభివృద్ధికి దోహదపడుతుందని, నిర్లక్ష్యం వహించకుండా ఓటును వినియోగించుకుని మంచి నాయకుడిని ఎన్నుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చిరంజీవి, బాలాజీ, వినయ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జొన్నవాడ ఆలయంలో వేలం పాటలు

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 22: జొన్నవాడ ఆలయంలో గురువారం పలు సీల్డ్, బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. ఈ వేలం పాటల్లో ఆలయంలో ఫోటోస్టాల్ ఏర్పాటుకు జరిగిన బహిరంగ వేలంలో పాటదారులు లక్షా 46వేల రూపాయలకు దక్కించుకున్నారని ఆలయ చైర్మన్ మావులూరి శ్రీనివాసులురెడ్డి, ఈఓ వి గిరికృష్ణ తెలిపారు. పబ్లికేషన్ ప్రింటింగ్, స్టేషనరీ సరఫరా చేసే పనులకు సీల్డు టెండర్లు, కొబ్బరిచిప్పలు సేకరణ, చాపలు, పీటలు, జంకాణాలు అద్దెకు ఇచ్చే పనులు, ఖాళీ నూనె డబ్బాలు, గోశాలలోని ఎరువు, పాత సామాగ్రి అమ్మకం, సులభ్ కాంప్లెక్స్ నిర్వహణకు వేలంపాటలు వాయిదా పడ్డాయి. కాగా, చెప్పుల స్టాండ్ నిర్వహణకు వేలంపాటలు నిర్వహించడంలేదనే విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ విషయంపై ఈఓ వి గిరికృష్ణను వివరణ కోరగా చెప్పులు పెట్టుకునే స్టాండ్‌లు ఏర్పాటుచేసి తరువాత వేలంపాటలు నిర్వహిస్తామని తెలిపారు.

ఆర్యవైశ్యులంతా ఏకం కావాలి



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

మనుబోలు, ఫిబ్రవరి 22: ఆర్యవైశ్యులంతా ఏకం కావాలని మనుబోలు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కామిశెట్టి కృష్ణచైతన్య పిలుపునిచ్చారు. మనుబోలులో గురువారం నిర్వహించిన ఆర్యవైశ్య సంఘం సమావేశానికి సంఘం జిల్లా నాయకుడు అమర్తలూరు చెంచయ్య ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆర్యవైశ్యుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 25వ తేదీన పొదలకూరులోని బోగోలు కృష్ణారెడ్డి కల్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం సమావేశం జరుగుతుందని, అందులో జిల్లా రూరల్ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం నిర్వహిస్తారన్నారు. అనంతరం బ్రోచర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు సురేష్, కామిశెట్టి భార్గవ్, రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు : డీసీవో



అంబేడ్కర్ విగ్రహన్ని ఆవిష్కరించిన డీసీవో

తోటపల్లి గూడూరు, ఫిబ్రవరి 22: విద్యతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అంబేడ్కర్ గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ టి హేమలత పేర్కొన్నారు. మండలంలోని కోడూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల కళాశాలలో గురువారం జిల్లా కోఆర్డినేటర్ టి హేమలత, ప్రిన్సిపాల్ సీహెచ్ ఎస్తేరమ్మలు అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం సమావేశంలో డీసీఓ మాట్లాడుతూ విద్య ద్వారా ఉన్నత స్థితికి ఎదగాలని బాలికలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ కె జయలక్ష్మీ, సీహెచ్ సుజాత, కె భారతి, ఎస్ సుమతమ్మ, బి శైలజకుమారి, కె పద్మావతి, స్థానిక నేత ఆగాల శ్రీనివాసులురెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ముక్కంటి నరసింహులు, వైస్ చైర్మన్ ముక్కంటి శ్రీనివాసులు, బాలికల తల్లిదండ్రులు, పాఠశాల, కళాశాలల బాలికలు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



మొక్క నాటుతున్న సుందరవల్లి

వెంకటాచలం, ఫిబ్రవరి 22: పల్లెబాట ద్వారా సమాజాభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావాలని వీఎస్‌యూ వీసీ సుందరవల్లి సూచించారు. గురువారం మండలంలోని కంటేపల్లి గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం ముగింపు కార్యక్రమానికి సుందరవల్లి ముఖ్య అతిథిగా విచ్చేసి మొక్కలు నాటారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ అల్లం ఉదయ్ శంకర్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ కే సునీత, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అల్లూరి లక్ష్మీనారాయణరెడ్డి, సోషల్ వర్క్ అధ్యాపకుడు డాక్టర్ ఆర్ మధుమతి, డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి తదితరులున్నారు.

రాగయ్యను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

సైదాపురం, ఫిబ్రవరి 22: తుమ్మల తలుపూరు పంచాయతీ పరిధిలోని చావలిప్ప గిరిజన కాలనీలో గురువారం కామ్రేడ్ పంతగిరి రాగయ్య సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన స్థూపం వద్ద జరిగిన కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కన్వీనర్ డీపీ పోలయ్య మాట్లాడారు. మైనింగ్ భూస్వాముల ఆక్రమణలో ఉన్న భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేద ప్రజలకు పంపిణీ చేయకపోతే రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఎర్ర జెండాలు నాటి ఆ భూములను పేదలకు అందేలా చూస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రామయ్యను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సీఎస్ సాగర్, రమేష్, అంకన్న, సుధా తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు ఆమరణ నిరాహార దీక్ష

● మత్స్యకార సంఘం అధ్యక్షుడు గోవిందు



గోవిందుకు మద్దతు తెలుపుతున్న జనసేన నాయకుడు సురేష్

ముత్తుకూరు, ఫిబ్రవరి 22 : తమ సమస్యలు పరిష్కరించే వరకు ఆమరణ నిరాహార దీక్షను విరమించేది లేదని సముద్ర తీరప్రాంత మత్స్యకార సంఘం అధ్యక్షుడు బసవంగారి గోవిందు తెలిపారు. మండల తహసీల్దారు కార్యాలయం సమీపంలో పోర్టు నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష గురువారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గోవిందు మాట్లాడుతూ అదాని యాజమాన్యం మత్స్యకారులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ, హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొబ్బేపల్లి సురేష్‌నాయుడు గోవిందుకు మద్దతు ప్రకటించి వారి సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం తీవ్రతరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంఘం నాయకులు ఏడుకొండలు, నరసయ్య, మహేష్, మురళి, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అష్టలక్ష్మీ యాగం



మాట్లాడుతున్న రఘునాథాచార్యస్వామి, శిష్య బృందం

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 22 : నగరంలోని వీఆర్ హైస్కూల్ మైదానంలో శుక్రవారం నుంచి మార్చి 3వరకు లోక కల్యాణం కోసం అష్టలక్ష్మీ యాగం చేస్తున్నామని అష్టలక్ష్మీ పీఠం స్వామి పీతాంబరం రఘునాథాచార్య, ఆయన శిష్య బృందం తెలిపారు. గురువారం వీఆర్సీ మైదానంలోని యజ్ఞవాటిక వద్ద విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 21 అష్టలక్ష్మీ యాగాలు చేశామన్నారు. 22వ యాగం నెల్లూరులో జరిపిస్తున్నామని, ఇందుకు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ ఎంతో సహకరిస్తున్నారన్నారు. సకాలంలో వర్షాలు కురవాలని, పాడి పంటలతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో జీవించాలని, రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని, ప్రపంచ శాంతికోరుతూ యాగం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిరోజు ఉదయం 6 నుంచి 12.45 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 10గంటల వరకు పూజలు జరుగుతాయన్నారు. గురువారం రాత్రి అంకురార్పణ మహోత్సవం జరిగిందిన, శుక్రవారం ఉదయం అగ్ని ప్రతిష్ఠ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కటకం హరి, కర్పూరం రమేష్, రంగనాథస్వామి దంపతులు పాల్గొన్నారు.

రూరల్ వైసీపీలో మరో వికెట్ డౌన్

● పార్టీకి రాజీనామా చేసిన ఆనం అనుచరుడు జయరామిరెడ్డి



రాజీనామాను ప్రకటిస్తున్న జయరామిరెడ్డి

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 22 : నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అధికార వైసీపీకి దెబ్బమీద దెబ్బతగులుతోంది. తాజాగా ఆ పార్టీ నాయకుడు ఆనం విజయకుమార్‌రెడ్డి ముఖ్య అనుచరుడు, కోడూరుపాడుకు చెందిన జయరామిరెడ్డి వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. గురువారం కొత్తకాలువ సమీపంలోని అశోక్‌నగర్‌లో గల ఆయన నివాసంలో అనుచరులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. తాను 20 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని, వైసీపీలో నిజాయితీపరులకు గుర్తింపు లేదని వాపోయారు. పెద్దమనిషిగా గుర్తింపు పొందిన రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పరిస్థితే ఇలా ఉంటే ఇక తమలాంటి సామాన్యుల పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో అర్థమవుతుందన్నారు. కార్యకర్తలకు గుర్తింపునిచ్చే ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి వంటి వారితోనే తన పయనమని, మార్చి 2న అనుచరులతో కలిసి టీడీపీలో చేరుతానని ప్రకటించారు. అనంతరం ఆయనను టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి శాలువాతో సత్కరించి పార్టీలోకి ఆహ్వానించారు. కాగా, రూరల్ నియోజకవర్గ పరిధిలోని 41వ డివిజన్ మనుమసిద్ధినగర్‌కు చెందిన కురిచేటి వీరాచారి, సుతారం సురేష్, కామిశెట్టి శివ, వెలిశెట్టి కమలాకర్, మహేశ్వరి, జానకిరామయ్య ఆచారి ఆధ్వర్యంలో వారి మిత్రమండలి టీడీపీలో చేరింది. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఆయన సోదరుడు గిరిధర్‌రెడ్డి సమక్షంలో పసుపు కండువా కప్పుకున్నారు. కాగా, 29వ డివిజన్ గాంధీనగర్‌లో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

యువత వలంటీర్ ఉద్యోగాలకే పరిమితం



జనసేన పార్టీలో చేరిన యువత

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 22: ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలన్న లక్ష్యంతో ఎంతో కష్టపడి చదువుకున్న యువత మన రాష్ట్రంలో వలంటీర్ ఉద్యోగాలకే పరిమితం అయ్యారని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ అన్నారు. యువజన సైనికులు వర, బన్నీ ఆధ్వర్యంలో 30 మంది యువకులు గురువారం జనసేన పార్టీలో చేరారు. నగరంలోని బృందావనంలో ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కిషోర్ యువతకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లుగా నిరుద్యోగులు నిరీక్షిస్తున్న జాబ్ క్యాలెండర్‌ను జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేయలేదన్నారు. ప్రజలతోపాటు ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఈ ప్రభుత్వ విధానాలతో విసిగిపోయారన్నారు. రానున్న రోజుల్లో ప్రజా ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేశవ, హేమచంద్ర యాదవ్, ప్రశాంత్‌గౌడ్, మౌనిష్ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మళ్ళదిబ్బలో ఇంటింటా సర్వే



గుమ్మళ్ళదిబ్బకాలనీలో వివరాలు సేకరిస్తున్న వైద్యసిబ్బంది

కోవూరు, ఫిబ్రవరి 22: కోళ్ళకు బర్డ్‌ఫ్లూ సోకిన గుమ్మళ్ళదిబ్బ కాలనీలో గురువారం ఇనమడుగు ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి ఇర్ఫాన్ ఆధ్వర్యంలో ఇంటింటా సర్వే నిర్వహించారు. ఇళ్ళలో పెం చుకుంటున్న కోళ్ళ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఇప్పటికే గుమ్మళ్ళదిబ్బ కాలనీలో సేకరించిన కోళ్ళ మాంసం శాంపిళ్ళను పరీక్షల నిమిత్తం పూనేలోని పరిశోధనాలయానికి పంపినట్లు డాక్టర్ ఇర్ఫాన్ తెలిపారు. వైద్యసిబ్బంది ఇంటింటికీ తిరిగి స్థానికుల్ని అప్రమత్తం చేశారు. కోళ్ళకు బర్డ్‌ఫ్లూ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని వివరించారు.

రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం



బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 22: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని బైపాస్ రోడ్డులో ఇటీవల నూతనంగా సీసీ రోడ్డు నిర్మించి రాజుపాళెం వద్ద మూడురోడ్ల కూడలిలో రోడ్డు మధ్యలో వున్న విద్యుత్ స్తంభాన్ని వదిలేయడంతో ప్రమాదం పొంచివుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బైపాస్ రోడ్డులో ఇటు రాజుపాళెం నుంచి జాతీయ రహదారి, జొన్నవాడ వైపు, జొన్నవాడ నుంచి రాజుపాళెం వైపు నిత్యం వందలకొద్ది ఇసుక, గ్రావెల్ లారీలు, ట్రాక్టర్లు తదితర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పొరపాటున విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నా పెనుప్రమాదం తప్పదని, అలాగే ఆ స్తంభం నుంచి వెళ్తున్న విద్యుత్ వైర్ల కింద నివాసాలుండే ప్రజలు కూడా భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలు తలెత్తకముందే తగు చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

కనుల పండువగా ధ్వజారోహణం



ధ్వజపటం ఊరేగిస్తున్న భక్తులు

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 22 : నగరంలోని నవాబుపేట ఉదయవర్లు దేవస్థానంలో శ్రీదేవి, భూదేవి సమేత ఆదికేశవ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతు న్నాయి. గురువారం ఉదయం ధ్వజారోహణం జరిగింది. కోడి ముద్దల ఉత్సవం వేడుకగా జరిగింది. సంతానంలేని మహి ళలు ఈ కోడి ముద్దల కోసం బారులు తీరారు. రాత్రి శేష వాహనం ఉత్సవం జరిగింది. శుక్రవారం ఉదయం 8గంట లకు సూర్యప్రభ వాహనం, రాత్రి హనుమంత వాహన సేవ జరుగుతాయని ఆలయ నిర్వాహకుడు పల్లాప్రోలు రామకృష్ణమాచార్యులు తెలిపారు.

'మాస్టర్ మైండ్' విద్యార్థులకు ఆల్ ఇండియా ర్యాంకులు



ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ చైతన్య

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 22 : ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా బుధవారం ప్రకటించిన ఫలితాల్లో మాస్టర్ మైండ్ కళాశాల విద్యార్థులకు ఆల్ ఇండియా స్థాయిలో ర్యాంకులు వచ్చాయని ఆ కళాశాల నెల్లూరు శాఖ ప్రిన్సిపాల్ చైతన్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చుండి రామసుబ్బారావు 505 మార్కులతో 14వ ర్యాంకును, ఏ శ్రీచందన 467మార్కులతో 41వ ర్యాంకును సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న నేతలు

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 22 : ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్టేడియంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బీ శేషగిరిరావు మాట్లాడుతూ అసోసియేషన్ క్రమం తప్పకుండా విద్యార్థుల కు పౌష్టికాహారం, వాకర్స్‌కు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తోందని చెప్పారు. దీనిలో భాగంగానే పేదలు, యాచకులకు దుప్పట్లు అందచేశామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు డీపీ రామా రావు, కార్యదర్శి జీవీ సురేంద్రబాబు, కోశాధికారి అరిగెల సాయిరాం, గౌరవాధ్యక్షుడు కిలారి తిరుపతి నాయుడు, మాజీ అధ్యక్షుడు వేలూరు రంగారావు, సభ్యులు పాల్గొన్నారు.

3న రాజకీయ గర్జన

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 22 : మాదిగల రాజకీయ గర్జన కార్యక్రమాన్ని మార్చి 3న నగరంలోని కొండాయపాళెం కూడలిలో నిర్వహిస్తున్నామని మన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లాల శ్రీనివాసులు తెలిపారు. గురువారం నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో మాదిగల రాజకీయ గర్జన పోస్టర్ ఆవిష్కరించారు.. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేయాలని, ఎన్నికల్లో ఒక ఎంపీ, ఒక ఎమ్మెల్యే సీటును మాదిగలకు కేటాయించాలనే డిమాండ్‌తో 'గర్జన' నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆదూరు రత్నం, పల్లాల సునీత, శ్రీరామ్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం	9985411424
నెల్లూరు ఏసీవో	9542727676
నెల్లూరు సిటీ	8179815202
నెల్లూరు రూరల్	8885688410
కోవూరు	8008894200







ఐఐటీ స్నాతకోత్సవంలో డైరెక్టర్ కె.ఎన్.సత్యనారాయణతో కలిసి విద్యార్థులకు పట్టాలందజేస్తున్న ఐఐటీ బోర్డు ఆఫ్ గవర్నర్స్ చైర్మన్ సజ్జన్ జిందాల్

అద్వితీయ విద్యాసంస్థ
తిరుపతి ఐఐటీ

● స్నాతకోత్సవంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్





ఐఐటీ స్నాతకోత్సవంలో వర్చువల్ పద్ధతిలో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రదాన్ ప్రసంగం

ఏర్పేడు, ఫిబ్రవరి 22 : ఓవైపు శ్రీవెంకటేశ్వర స్వామి, మరోవైపు శ్రీకాళహస్తీశ్వర స్వామి వార్ల ఆశీస్సులు పొందుతున్న తిరుపతి ఐఐటీ దేశంలోని మిగిలిన ఉన్నత విద్యా సంస్థలతో పోలిస్తే అద్వితీయ విద్యా సంస్థ అని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ కొనియాడారు. తిరుపతి జిల్లాలోని ఏర్పేడు సమీపంలో వున్న తిరుపతి ఐఐటీ 4వ మరియు 5వ స్నాతకోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆయన ఢిల్లీ నుంచీ వర్చువల్ విధానంలో ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా యువ విద్యార్థులకు నాణ్యమైన, అధునాతన సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన విద్యను అందుబాటులోకి తీసుకురావడంలో మోదీ ప్రభుత్వ నిబద్ధతకు ఐఐటీలే నిదర్శనమన్నారు. ఆరోగ్యకరంగా ఎదిగే ప్రక్రియలో తిరుపతి ఐఐటీ నిస్సందేహంగా ఒక ప్రధాన లబ్ధిదారని మంత్రి అభివర్ణించారు. స్వల్ప వ్యవధిలోనే తిరుపతి ఐఐటీ టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్ సాధించిందని, అలాగే ఐఐటీ నవవిష్కార్, ఐ హబ్ ఫౌండేషన్ వంటివి ఏర్పాటు చేయడంలో చొరవ చూపిందని ప్రశంసించారు. తిరుపతి ఐఐటీ సెంటర్ ఆఫ్ ఎగ్జలెన్స్ ప్రధానంగా స్మార్ట్ మాన్యుఫాక్చరింగ్, ఈవీ టెక్నాలజీస్ వంటి అంశాలపై దృష్టి సారించిందని, దేశంలోని పట్టణ రవాణా రంగంలో పెరుగుతున్న అవసరాలను తీర్చడంలో తిరుపతి ఐఐటీకి చెందిన ఈ విభాగాలు గేమ్ ఛేంజర్ కాబోతున్నాయన్నారు. స్మార్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఫుడ్ టెక్నాలజీస్, ప్రిసెషన్ అగ్రికల్చర్ రంగాల్లో తిరుపతి ఐఐటీ దృష్టి సారించాలని కేంద్ర మంత్రి పిలుపునిచ్చారు. తిరుపతి ఐఐటీ బాలికలు ఎంచుకుంటున్న ప్రధాన గమ్యస్థానంగా మారడం పట్ల మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. దేశంలోని అన్ని ఇతర ఐఐటీల కంటే ఇక్కడే ఎక్కువ సంఖ్యలో బాలికలు చదువుకుంటున్నారని, ఇది నారీ శక్తికి నిదర్శనమన్నారు. నారీ శక్తి వందన్ అధినియమ్ అనేది తమ ప్రభుత్వ నిర్ణయమని, లోక్‌సభలోనూ, రాష్ట్రాల అసెంబ్లీల్లోనూ మూడొంతుల సీట్లు మహిళలకు రిజర్వు చేయడం అందులో భాగమేనన్నారు. నిర్ణయాత్మక శక్తిగా మహిళలను అభివృద్ధి పరచడమే దాని ఉద్దేశమన్నారు. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకునేలా మహిళల్లో నాయకత్వ లక్షణాలను పెంచే దిశగా ఐఐటీల నుంచీ వెలుపలికి వచ్చిన విద్యార్థినులు కృషి చేయాల్సిన అవసరముందన్నారు. స్నాతకోత్సవం సందర్భంగా పట్టభద్రులవుతున్న రెండు బ్యాచ్‌ల విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసిన మంత్రి విద్యార్థుల ఈ ప్రయాణంలో కీలక పాత్ర పోషించిన తల్లిదండ్రులకు, అధ్యాపకులకు అభినందనలు తెలిపారు. ఐఐటీ బోర్డు ఆఫ్ గవర్నర్స్ చైర్మన్, మరియు జిందాల్ స్టీల్ వర్క్స్ సంస్థ చైర్మన్ సజ్జన్ జిందాల్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి అతిధిగా రావడం సంతోషంగా ఉందన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులు ప్రపంచస్థాయికి ఎదగాలని కోరారు. ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఐఐటీ పనుల ప్రారంభంలో ఈ ప్రాంతంలో తిరగడానికి భయపడేవారమని గుర్తు చేసుకున్నారు.విద్యార్థులకు సరిపడే కళాశాల భవనాలు, హాస్టల్ భవనాలు, లేబరేటరీలు, క్యాంటీన్లు, మీటింగ్ హాళ్లు, తరగతిగదులతో ప్రస్తుతం ఆహ్లాదకరమైన వాతావరణం కళాశాలలో ఉందన్నారు.పీఆర్వో చమన్ మెహతా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆనందంగా ఉంది



బీటెక్ ప్రోగ్రాంలో బెస్ట్ అకడమిక్ పెర్ఫార్మెన్స్ అవార్డు అయిన ప్రెసిడెంట్ మెడల్‌ను అమ్మానాన్నల సమక్షంలో అందుకోవడం ఆనందంగా ఉంది.ఐఐటీలో చేరిన మొదట్లో ఆహారపు అలవాట్లు, వాతావరణ మార్పుతో చాలా ఇబ్బంది పడ్డా.మెల్లిగా తిరుపతి వాతావరణానికి అలవాటు పడి చదువుకున్నా.

- సౌమిత్రో వ్యాపారి, ప్రెసిడెంట్ మెడల్ విన్నర్

నా కష్టానికి ఫలితం



పట్టుదల,కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చనే మాటను నిజం చేయడానికి చాలా కష్టపడ్డా.పట్టుదలతో చదువుకుని గవర్నర్ ప్రైజ్‌కు ఎంపికయ్యా. స్నాతకోత్సవంలో గవర్నర్ ప్రైజ్‌ను ఇంతమంది ప్రముఖుల సమక్షంలో అందుకోవడం సంతృప్తినిచ్చింది.

- ప్రభాత్ రెడ్డి లంకిరెడ్డి, గవర్నర్ ప్రైజ్ విన్నర్

575 మందికి పట్టాల ప్రదానం

స్నాతకోత్సవాలను పురస్కరించుకుని క్యాంపస్‌లో మొత్తం 575మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు.ఐఐటీ డైరెక్టర్ కె.ఎన్.సత్యనారాయణతో కలిసి సజ్జన్ జిందాల్ ఈ పట్టాలను అందజేశారు. బీటెక్ పూర్తి చేసిన 355 విద్యార్థులకు, ఎంటెక్ పూర్తి చేసిన 106 మంది విద్యార్థులకు, ఎమ్మెస్సీ ముగించిన 74 మందికి, ఎంఎస్ పూర్తి చేసిన 17 మందికి, పీహెచ్‌డీ పూర్తి చేసిన 21 మందికి, డ్యూయల్ డిగ్రీ చేసిన ఇద్దరికి చొప్పున మొత్తం 575 మందికి పట్టాలు అందజేశారు. 2021-22 బ్యాచ్ 4వ స్నాతకోత్సవానికి సంబంధించిన మొత్తం బీటెక్ గ్రాడ్యుయేట్లలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సౌమిత్రో వ్యాపారికి ప్రెసిడెంట్ గోల్డ్ మెడల్, లంకిరెడ్డి ప్రభాత్‌రెడ్డికి గవర్నర్ ప్రైజ్ లభించాయి. అలాగే 2022-23 బ్యాచ్ 5వ స్నాతకోత్సవానికి సంబంధించి బీటెక్ గ్రాడ్యుయేట్లలో అత్యుత్తమ ప్రతిభ చాటిన దేబాషీ దాస్ అనే విద్యార్థిని ప్రెసిడెంట్ గోల్డ్ మెడల్, నోబుల్ సాజి మాథ్యూస్‌కు గవర్నర్ ప్రైజ్ లభించాయి.



దామలచెరువు హైస్కూల్ వద్ద భువనేశ్వరికి గజమాలతో స్వాగతం పలుకుతున్న చంద్రగిరి నియోజకవర్గ నేతలు, శ్రేణులు

టీడీపీ శ్రేణులపై వైసీపీ చిత్రహింసలు
మరిచిపోలేం

● రాష్ట్రాభివృద్ధికి కార్యకర్తలంతా కష్టపడాలి

● కొత్త ఓటర్లూ, మీ భవితను దృష్టిలో పెట్టుకుని ఓటేయండి ● నారా భువనేశ్వరి పిలుపు

● మూడో రోజు ఐదు కుటుంబాలకు పరామర్శ

నేటి పర్యటన ఇలా..

శుక్రవారం ఉదయం 10.45 గంటలకు చిత్తూరు రూరల్ మండలం ముత్తుకూరలో.. 11.45 గంటలకు ఎస్ఆర్‌పురం మండలం గంగమ్మ గుడి గ్రామంలో కర్ణం ఆంజనేయులు నాయుడు కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శిస్తారు. 1.15 గంటలకు తిరుపతి జిల్లా నారాయణవనం మండలం తుంబూరులో కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించి.. 3.25 గంటలకు రేణిగుంట విమానాశ్రయం నుంచి హైదరాబాదుకు పయనమవుతారని టీడీపీ వర్గాలు తెలిపాయి.

కల్లూరు/ఐరాల/బంగారుపాళ్యం/చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 22: 'తెలుగుదేశం పార్టీ వారిని చిత్రహింసలకు గురిచేయడం.. అక్రమ కేసులు పెట్టడం.. వారి ఆర్థిక మూలాలను దెబ్బతీయడం. ఇదే వైసీపీ ప్రభుత్వం పని. వీటిని మరచిపోలేం. టీడీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్ గురించి అందరూ గొప్పగా మాట్లాడుకునే వారు. ఇప్పుడు వైసీపీ ప్రభుత్వ అరాచకాల గురించి మాట్లాడుకుంటున్నారు. ఇది సిగ్గుచేటు' అని నారా భువనేశ్వరి వ్యాఖ్యానించారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా మూడో రోజైన గురువారం ఆమె పులిచెర్ల, ఐరాల, బంగారుపాళ్యం మండలాలతో పాటు చిత్తూరు నగరంలో పర్యటించారు. ఐదు కుటుంబాలను పరామర్శించారు. ఆయా ప్రాంతాల్లో టీడీపీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. చంద్రబాబు జైలులో ఉన్న సమయంలోనే పుంగనూరు నియోజకవర్గంలో చల్లా బాబుతో పాటు వందలాది మంది అక్రమకేసుల్లో జైలులో ఉంటూ ఇబ్బందులు పడ్డారనే విషయం మరిచిపోలేమన్నారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా.. ప్రస్తుతం మహిళలు కూడా ధైర్యంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. రాష్ట్ర భవిత కోసం పార్టీ కార్యకర్త, నాయకుడు చేయిచేయి కలిపి పార్టీని ముందుకు తీసుకెళ్లి చంద్రబాబును గెలిపించాలని కోరారు. కొత్తగా ఓటు నమోదు చేసుకున్న యువత.. రాష్ట్ర, మీ భవిష్యత్తును గుర్తుంచుకుని ఓటేయాలని పిలుపునిచ్చారు. వైసీపీ వారి దౌర్జన్యాలు, అక్రమాలకు దీటుగా జవాబు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో పార్టీ శ్రేణులు ఎన్నో త్యాగాలు చేసి, అనేక ఇబ్బందులు పడ్డారని గుర్తుచేసుకున్నారు. జగన్ పాలనలో ఏ వర్గమూ సంతోషంగా లేదని, యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లేకుండా చేసిన ఘనత వైసీపీకే దక్కుతుందన్నారు. ఈ అరాచక ప్రభుత్వంపై రానున్న ఎన్నికల కురుక్షేత్రంలో కార్యకర్తలు సైఅంటే సై అనేలా పోరాటానికి సిద్ధంగా ఉండాలన్నారు.

కమ్మపల్లెపై కక్ష కట్టిన మంత్రి పెద్దిరెడ్డి

పులిచెర్ల మండలం కమ్మపల్లెవాసులు టీడీపీకి మద్దతు ఇస్తున్నారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గ్రామంపై కక్ష కట్టారని భువనేశ్వరికి విన్నవించారు. జనాభా ఉన్నా కమ్మపల్లెలోని పాఠశాలను రద్దుచేయించి బయట అడవిలో కట్టారన్నారు. కమ్మపల్లెకి మంజూరైన వాటర్‌ట్యాంకు ఊరి బయట కట్టారని ఆమె దృష్టికి తీసుకొచ్చారు. మంత్రి పెద్దిరెడ్డి ఎంత ప్రయత్నించినా తాము వైసీపీలోకి వెళ్లకపోవడంతో అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు చెప్పారు. చంద్రబాబు మద్దతుదారులుగా ఉంటామని, టీడీపీ అంటే తమకు ప్రాణమన్నారు. పగడాలవారిపల్లెలో టీడీపీ జాతీయ కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గ పునర్విభజనకు ముందు పులిచెర్ల మండలం చంద్రగిరి నియోజకవర్గంలో ఉండేదని, నారావారిపల్లె ఇక్కడికి 20 కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు. ప్రజలు ప్రతి ఎన్నికలో టీడీపీకి మెజార్టీ ఇచ్చారని గుర్తు చేశారు. మంత్రి పెద్దిరెడ్డి టీడీపీ వారిని హింసిస్తుండగా మధుసూదన్‌రెడ్డి, నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి కొన్ని విషయాల్లో సహాయం చేశారని గ్రామస్తులు తెలిపారు.

పర్యటన సాగిందిలా..

● పుంగనూరు నుంచి బయలుదేరిన ఆమె.. పులిచెర్ల మండలం కమ్మపల్లెలో వెంకటపతి నాయుడు, పడగలవారిపల్లెలో దొరస్వామి కుటుంబాలను పరామర్శించి రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి వెంట ఉన్నారు.

● ఐరాల మండలం చింతగుంపలపల్లెలో జయప్రకాష్, బంగారుపాళ్యం మండలం టేకుమందలో గోవిందయ్య కుటుంబాలను ఓదార్చారు. వైసీపీ దాడిలో రెండు కళ్లను కోల్పోయిన హంసవేణిని పరామర్శించారు. ఆమె వెంట నియోజకవర్గ ఇన్‌చార్జి మురళీమోహన్ ఉన్నారు. చిత్తూరు నగరం కొంగలూరులో గురువారం రాత్రి చెరుకూరు సుజాతమ్మ కుటుంబాన్ని పరామర్శించారు. బ్యాన్స్ హోటల్‌లో బస చేశారు. ఆయా కుటుంబాలను పరామర్శించిన అన్నిచోట్లా ఆమెను చూసేందుకు, సంఘీభావం పలికేందుకు వచ్చిన కార్యకర్తలను, మహిళలను చూసి భువనేశ్వరి మాట్లాడారు. మార్గమధ్యంలో వేచిఉండేవారిని చూసి కారు ఆపి పలకరిస్తూ వెళ్లారు.

టార్గెట్ బలిజ ఓటర్లు !

● ఆధార్ కార్డుల సేకరణ పనిలో వైసీపీ ● 'మెప్మా' పేరిట డ్వాక్రా మహిళలకు ఎర

● కార్పొరేషన్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన టీడీపీ నాయకులు



కమిషనర్ అదితి సింగ్‌కు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేతలు

తిరుపతి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో అధికార పార్టీ బలిజ ఓటర్లను టార్గెట్ చేసింది. ప్రలోభాలు, బెదిరింపులు, బుజ్జగింపులతో ఇప్పటికే పలువురు కాపులను తమ వైపు తిప్పుకుంటూ వస్తున్నారు.తృతీయ శ్రేణి నాయకులకు బలవంతంగా కండువాలు వేస్తున్నారు కానీ బలిజ ఓట్లపై పెట్టుకున్న ఆశలు మాత్రం వైసీపీ నేతల్లో సన్నగిల్లిపోతున్నాయి.దీంతో సాధారణ ఓటర్లను మభ్యపెట్టే పనిలో పడ్డారు. మెప్మా పేరుచెప్పి డ్వాక్రా గ్రూపుల్లో బలిజ మహిళల ఆధార్ కార్డులు సేకరించే పని మొదలుపెట్టారు. పొదుపుసంఘాల్లోని బలిజ ఓటర్ల జాబితా కావాలని ఆర్పీల ద్వారా వాట్సప్ గ్రూపుల్లో వాయిస్ మెసేజ్‌లు పెట్టి సేకరిస్తున్నారు.నగరంలోని పొదుపు సమాఖ్యల్లో దాదాపు 160మంది ఆర్పీలుంటే అందులో 40మంది వరకు బలిజ సామాజికవర్గ మహిళలు ఉన్నారు. వీరి ద్వారా సంఘాల్లో ఉండే మహిళల జాబితాను సేకరించి వైసీపీ అభ్యర్థి అభినయ్ రెడ్డితో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయనున్నట్టు తెలిసింది. అలివిగాని హామీలు ఇచ్చేసి బలిజ సామాజికవర్గ మహిళల దగ్గర ఓటు వేసేలా ఒట్టుపెట్టుకునే హామీలు తీసుకోనున్నట్టు ప్రచారం జరుగుతోంది.ఈ విషయంపై ఆధారాలతో టీడీపీ నేతలు గురువారం కమిషనర్ అదితి సింగ్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె సంబంధిత అధికారులను ఆరా తీశారు. విచారించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, నాయకులు ఊకా విజయకుమార్, జేబీ శ్రీనివాస్, కంకణాల రజనీకాంత్ నాయుడు, రఘు తదితరులు పాల్గొన్నారు.

దుమ్మురేపిన గొడవలో పుణేవాసి మృత్యువాత

తిరుపతి, మహారాష్ట్రవాసుల నడుమ దాబాలో ఘర్షణ ఫలితం



రిషంత్ జగపత్ మృతదేహం

రేణిగుంట, ఫిబ్రవరి 22 : దాబా హోటల్‌లో తిరుపతి, మహారాష్ట్ర వాసులకు నడుమ జరిగిన ఘర్షణలో పుణేకి చెందిన ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన రేణిగుంట పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు... మహారాష్ట్రలోని పుణే, పరిసర ప్రాంతాలకు చెందిన 11 మంది స్నేహితులు బృందంగా ఏర్పడి శ్రీవారి దర్శనం కోసం తిరుపతి వచ్చారు. బుధవారం అర్ధరాత్రి శ్రీకాళహస్తి వెళుతూ మార్గమధ్యం లోని రేణిగుంట మండలం గుత్తివారిపల్లి - మల్లవరం మధ్య రోడ్డుపక్కనున్న సంతోష్ పంజాబీ దాబా హోటల్ వద్ద ఆగారు. కొంతసేపటికి తిరుపతి నగరం కొర్లగుంటకు చెందిన ఆరుగురు మద్యం సేవించి అతివేగంగా వాహనంలో దాబా దగ్గరకు చేరుకున్నారు.ఆ క్రమంలో వారు ప్రయాణిస్తున్న కారు వేగంగా వచ్చి సడన్ బ్రేక్ వేసి ఆపడంతో పెద్దఎత్తున దుమ్ము రేగింది. అదే హోటల్‌లో మహారాష్ట్రకు చెందిన వారు కూర్చుని భోంచేస్తుండగా దుమ్ము వారి ప్లేట్లలో పడింది.దీంతో ఆగ్రహించిన మహారాష్ట్రవాసులు ఇంత వేగమెందుకని ప్రశ్నించారు.ఒకరు లేచి కారు అద్దాలను కొట్టారు.దీంతో తిరుపతివాసులు గొడవకు దిగడంతో ఇరువర్గాల నడుమ ఘర్షణ జరిగింది.పుణేకి చెందిన రిషంత్ జగపత్ (45), కుల్దీప్ (45) తీవ్రంగా గాయపడ్డారు.ఘటనా స్థలంలో వున్న వారిచ్చిన సమాచారంతో పోలీసులు చేరుకుని ఆ ఇద్దరినీ తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. గురువారం ఉదయం 8 గంటల సమయంలో చికిత్స పొందుతూ రిషంత్ జగపత్ మృతి చెందాడు. మృతుడి స్నేహితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రేణిగుంట పోలీసులు హత్యానేరం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తిరుపతికి చెందిన ఆరుగురిలో ఇప్పటికే ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని సమాచారం. మిగిలిన వారి కోసం గాలిస్తున్నారు. రిషంత్ జగపత్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి సంబంధీకులకు మృతదేహాన్ని అప్పగించారు.

సీఎం పర్యటన ఏర్పాట్లకు రూ.2 కోట్లు కావాలి

● హౌసింగ్ నిధుల్ని అత్యవసరంగా మళ్లించండి

● ఎండీకి లేఖ రాసిన చిత్తూరు కలెక్టర్ షన్మోహన్

చిత్తూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ పర్యటన ఏర్పాట్ల కోసం రూ.2 కోట్ల నిధుల్ని మళ్లించమని హౌసింగ్ శాఖ రాష్ట్ర మేనేజింగ్ డైరెక్టర్‌కు కలెక్టర్ షన్మోహన్ లేఖ రాశారు. వివరాల్లోకి వెళితే.. రామకుప్పంలో హంద్రీనీవా నీళ్లను వదిలి, బహిరంగ సభ ఏర్పాటు చేసేందుకు సీఎం జగన్ పర్యటన ఇప్పటికే పలు మార్లు వాయిదా పడింది. ఫైనల్‌గా ఆయన సోమవారం జిల్లాకు రానున్నారు. ఈ మేరకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పర్యటన ఏర్పాట్లను పూర్తి చేసేందుకు రూ.2 కోట్ల వరకు ఖర్చు కానుంది. సాధారణంగా కలెక్టర్ ఖాతాల్లో కనీసం రూ.20 కోట్ల నుంచి రూ.30 కోట్ల వరకు నిధులు ఉంటాయి. టీడీపీ హయాంలో పనిచేసిన సిద్ధార్థజైన్, ప్రద్యుమ్న ఖాతాల్లో రూ.కోట్లలో నిధులు నిత్యం ఉండేవి. వాటితో కలెక్టర్లు తమ విచక్షణతో పలు కార్యక్రమాలు చేపట్టేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక జిల్లాలో పనిచేసిన ఏ కలెక్టర్ ఖాతాలోనూ రూ.10 లక్షలకు మించి ఉండడం లేదు. ఇదిలా ఉండగా, జిల్లాల్లో సీఎం జగన్ పర్యటన ఉన్నప్పుడు ఏర్పాట్ల కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధుల్ని మంజూరు చేస్తుంది. ఈసారి ప్రత్యేక నిధులు జిల్లాకు రాలేదని తెలిసింది. ఈ క్రమంలో ఏర్పాట్ల కోసం రూ.2 కోట్లను అత్యవసరంగా కేటాయించాలని కలెక్టర్ హౌసింగ్ ఎండీకి గురువారం లేఖ రాశారు. ప్రస్తుతం ఇళ్లను నిర్మించుకున్న లబ్ధిదారులకు ఇవ్వాల్సిన బిల్లుల నిధులు హౌసింగ్ శాఖ అందుబాటులో ఉన్నాయి.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

తిరుమూరులో ఫీవర్ సర్వే




తిరుమూరులో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం - తొట్టెల్లో నిల్వ ఉన్న నీటిని పరిశీలిస్తున్న డాక్టర్ శశికుమార్

వాకాడు, ఫిబ్రవరి 22: అంతుచిక్కని జ్వరంతో ఇబ్బంది పడుతున్న తిరుమూరులో గురువారం వైద్యులు రామకృష్ణ, శశికుమార్ ఆధ్వర్యంలో ఫీవర్ సర్వే నిర్వహించారు. అలాగే గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఇంటింటికీ వెళ్లి డెంగ్యూ, మలేరియా పరీక్షలు చేశారు. బాధితులకు మందులు పంపిణీ చేశారు. డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ.. దోమకాటుతో వైరల్ ఫీవర్స్‌తోపాటు డెంగ్యూ, మలేరియా వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని చెప్పారు. వైద్యులవెంట సూపర్‌వైజర్ సలోమి, పంచాయతీ సెక్రటరీ శిరీషా, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశాలు ఉన్నారు.

గూడూరులో 'వికసిత్ భారత్'

గూడూరు, ఫిబ్రవరి 22: ఎంపీడీవో కార్యాలయ సమీపంలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేవైఎం రాష్ట్ర అధికారప్రతినిధి మనోజ్‌కుమార్, చెంచురెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



గూడూరు, ఫిబ్రవరి 22: ఇందిరమ్మకాలనీలో గురువారం వాటంబేడు శివకుమార్, హరికుమార్ ఆధ్వర్యంలో అభయాంజనేయస్వామి గుడి నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. రత్నకుమార్, నాగేశ్వరరావు, శ్రీవర్ధన్‌రెడ్డి, సుబ్బారావు, పెంచలయ్య, బాబురావు, భక్తులు పాల్గొన్నారు.

సరస్వతీదేవికి పూజలు

బాలాయపల్లి, ఫిబ్రవరి 22: జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులు గురువారం సరస్వతీ దేవికి పూజలు చేశారు. హెచ్‌ఎం రవీంద్రరెడ్డి, లలిత శివజ్యోతి, సువర్ణ, గీత, కిరణ్, శ్రీక్రిష్ణ, రామసుబ్బయ్య, మునీర్ బాషా, శ్రీనివాసులు, గిరి, కోటేశ్వరావు పాల్గొన్నారు.

అక్రమంగా రుణం పొందడంపై ఫిర్యాదు

బాలాయపల్లి, ఫిబ్రవరి 22: అక్కసముద్రం రెవెన్యూ పరిధిలో తన భార్య రావిళ్ల విజయలక్ష్మి పేరున ఉన్న భూమికి యాచవరానికి చెందిన గొట్టిముక్కల సత్యనారాయణ అక్రమంగా రుణం తీసుకున్నారని రావిళ్ల వెంకటక్రిష్ణమనాయుడు బాలాయపల్లి పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. అక్కసముద్రం రెవెన్యూలోని సర్వే నెంబరు 183లో 4,5,3,2 భిన్నములలో ఉన్న ఐదు ఎకరాల భూమిని 2011 సంవత్సరంలో రిజిస్ట్రేషన్ చేసుకున్నామని చెప్పారు. అయితే సత్యనారాయణ ఎన్డీసీసీ బ్యాంకులో ఉద్యోగిగా ఉండడంతో యాచవరం, జయంపు సొసైటీల్లో తమ భూములపై అక్రమంగా రుణాలు తీసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఇప్పటికే జిల్లా ఉన్నతాధికారులకు, స్థానిక రెవెన్యూ సిబ్బందికీ ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.

రేపు నిమ్మ, చీనీ, సపోటా ఫలసాయం వేలం

వెంకటగిరి, ఫిబ్రవరి 22: వెంకటగిరి పట్టణంలోని 8వ వార్డు పెరియవరంలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రం ప్రాంగణంలో ఉన్న 230 నిమ్మ చెట్లు, 140 చీనీ చెట్లు, 75 సపోటా చెట్లకు సంబంధించిన ఫలసాయాన్ని శనివారం వేలం వేయనున్నారు. కేంద్ర ప్రాంగణంలో వేలంపాట జరుగుతుందని అధిపతి డాక్టర్ బీగోవింద రాజులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు కేంద్ర పనివేళల్లో సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

ఎమ్మెల్యే కిలివేటికి ప్రముఖుల పరామర్శ



కిలివేటిని పరామర్శించిన డిప్యూటీ సీఎం నారాయణస్వామి

తడ, ఫిబ్రవరి 22: సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యను పలువురు ప్రముఖులు పరామర్శించారు. ఆయన తల్లి కాదలూరు సర్పంచ్ కిలివేటి మస్తానమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో ఆమె మృతి చెందారు. దీంతో గురువారం ఎమ్మెల్యే కిలివేటి స్వగ్రామం కాదలూరుకు డిప్యూటీ సీఎం నారాయణస్వామి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు వాకాటి నారాయణరెడ్డి, ఎన్డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, టీడీపీ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, పలువురు ఎంపీపీలు, వైసీపీ నాయకులు మస్తానమ్మ మృతదేహానికి పుష్పాంజలి సమర్పించారు. ఎమ్మెల్యేను పరామర్శించారు.

దగ్గవోలులో మాజీమంత్రి



నాయకులతో మాట్లాడుతున్న నేదురుమల్లి రాజ్యలక్ష్మి

దక్కిలి, ఫిబ్రవరి 22: దగ్గవోలు గ్రామాన్ని గురువారం మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు మస్తాన్‌నాయుడు, మీరయ్య కుటుంబసభ్యులతో చర్చించారు. తన కుమారుడు రాంకుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. శ్రీనివాసులురెడ్డి, మస్తాన్‌నాయుడు, మీరయ్య, కృష్ణయ్య, తదితరులు ఆమెవెంట ఉన్నారు.

చికెన్ వ్యర్థాలను అడ్డుకున్న పోలీసులు

బాలాయపల్లి, ఫిబ్రవరి 22: తిరుపతి చికెన్ దుకాణాల నుంచి వ్యర్థాలను సేకరించి మనుబోలుకు తరలిస్తున్న ఓ వాహనాన్ని ఎస్ఐ మహబూబ్ సుభాని బాలాయపల్లి బస్టాండు సమీపంలో గురువారం అడ్డుకున్నారు. ఆ వ్యర్థాలను వెంగమాంపురం సమీపంలోని ఖాళీ ప్రదేశంలో ఎక్స్‌కవేటర్‌తో గొయ్యి తీసి పూడ్చిపెట్టారు. అనంతరం చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న తిరుపతి అంకయ్య, పసుపులేటి వెంకటేష్, అంకయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధికే ఆసరా

చిల్లకూరు, ఫిబ్రవరి 22: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికే రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా తీసుకొచ్చిందని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌రావు అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో పొదుపుసంఘాల మహిళలకు ఆసరా మెగా చెక్కు అందజేశారు. మండలంలోని 766 పొదుపు సంఘాల్లోని 7631 మందికి రూ.5.09కోట్లను అందించడం జరిగిందన్నారు. ఓడూరు యమునమ్మ, బాలకృష్ణారెడ్డి, యల్లంటి సనత్‌కుమార్‌రెడ్డి, అశోక్, శ్రీనివాసులు, ఎంపీడీవో రమణమూర్తిరావు, ఏసీ చంద్రబాబు, ఎంపీఎం గున్నయ్య, మమత, సీసీలు పాల్గొన్నారు.

వైసీపీ దుష్ప్రచారాలను తిప్పికొడదాం: టీడీపీ



మీడియాతో మాట్లాడుతున్న శ్రీనివాసులు

కోట, ఫిబ్రవరి 22: వైసీపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొడదామని టీడీపీ శ్రేణులకు బీసీసెల్ మండల అధ్యక్షుడు చాపల శ్రీనివాసులు పిలుపునిచ్చారు. కోటలోని టీడీపీ కార్యాలయంలో గురువారం రాత్రి మీడియాతో మాట్లాడారు. కేశవరం పంచాయతీలో ముమ్మడి సురేంద్రబాబు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సమక్షంలో వైసీపీ శ్రేణులు అధిక సంఖ్యలో స్వచ్ఛందంగా టీడీపీలో చేరితే స్థానికంగా ఉన్న వైసీపీ నేతలు దానిని వక్రీకరిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో మరో మూడు నెలల్లో టీడీపీ ప్రభంజనం కొనసాగడం ఖాయమన్నారు. ఆ ప్రభంజనంలో వైసీపీ నేతలు కొట్టుకుపోతారని స్పష్టం చేశారు. గూడూరు నియోజకవర్గంలో రోజురోజుకూ టీడీపీలోకి వలసలు వస్తుంటే వైసీపీ నాయకులు మతిభ్రమించి, రకరకాలుగా ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి జడ వేణు, ముమ్మడి సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీ' విధ్వంస పాలనకు చరమగీతం పాడాలి: పాశిం



టీడీపీలో చేరినవారితో మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, ఫిబ్రవరి 22: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం సాగిస్తున్న విధ్వంస పాలనకు రానున్న ఎన్నికల్లో ప్రజలు చరమగీతం పాడాలని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని చెంబడిపాళెం గ్రామంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పలువురు టీడీపీలో చేరడంతో వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనపై ప్రజలు విసిగిపోయారన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక్క అభివృద్ధిపని కూడా చేపట్టలేదన్నారు. అవినీతిని ప్రశ్నించేవారిపై దాడులకు, దౌర్జన్యాలకు దిగుతున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. గాడితప్పిన రాష్ట్రాన్ని సరైన మార్గంలో నడిపించాలంటే చంద్రబాబుకే సాధ్యమవుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో అందరం కష్టపడి పనిచేసి టీడీపీని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, ఇనుకుర్తి మల్లికార్జున్‌నాయుడు, పుట్టి వెంకటేశ్వర్లునాయుడు, గోపాలయ్యనాయుడు, అమరేంద్ర, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పాలన కోసం ప్రజల ఎదురుచూపు

రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో విసిగిపోయిన ప్రజలు టీడీపీ పాలన కోసం ఎదురుచూస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. గురువారం నలజాలమ్మవీధిలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలోభాగంగా ఇంటింటి ప్రచారం చేశారు. పులిమి శ్రీనివాసులు, శ్రీధర్, దయాకర్, సోమిశెట్టి చెంచురామయ్య, భయ్యా మోహన్‌రావు, నాగసూరు గోపాల్‌రావు, నరసింహులునాయుడు, గురవయ్య, కల్పన, గుండాల లీలావతి, శైలజ, భారతి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధిని మరిచిన వైసీపీని గద్దెదించాలి: జనసేన



కరపత్రాలను పంపిణీ చేస్తున్న జనసేన నాయకులు

చిల్లకూరు, ఫిబ్రవరి22:రాష్ట్రాభివృద్ధిని మరిచి రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ అన్నారు. గురువారం లింగవరం గ్రామంలో జనంలోకి జనసేన కార్యక్రమంలో భాగంగా ఇంటింటా ప్రచారం చేశారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిత్యావసరాల ధరలు, విద్యుత్, బస్సు చార్జీలు పెరిగిపోయాయన్నారు. రానున్న ఎన్నికలలో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థుల గెలుపునకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. కార్తీక్, మహేష్, సుధీర్, శ్రీనివాసులు, హేమంత్, రాజేంద్ర, విమల్, వంశీ, హరికృష్ణ, మహేంద్ర, ఇంద్రవర్ధన్, సాయి, శివ, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో అంబేడ్కర్ భవనం




శిథిలమైన భవనం (ఇన్‌సెట్లో) ఆవరణలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

గూడూరు, ఫిబ్రవరి 22: ఎన్నో శుభకార్యాలు, సమావేశాలకు వేదికగా నిలిచిన అంబేడ్కర్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. 2000 సంవత్సరంలో పాత బస్టాండు సమీపంలో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనాన్ని ప్రారంభించారు. ఎస్సీ సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహణ చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. పేదవారు తక్కువ అద్దెతో శుభకార్యాలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు వీలుగా ఉండేది. ఒక రోజుకు భవనం అద్దెగా ఎస్సీ, ఎస్టీలకు రూ.2000, ఇతర కులాలవారికి రూ.5000గా నిర్ణయించారు. అందువల్ల పేద, మధ్య తరగతివారికి ఈ అద్దె ధరలు అందుబాటులో ఉండడంతో ఈ భవనాన్ని ఎక్కువగా వినియోగించుకునేవారు. కొన్నేళ్లకు భవనం శిథిలావస్థకు చేరుకుంది. 2016 నుంచి అయితే నిరుపయోగంగా మారింది. ఆవరణంలో పిచ్చిమొక్కలు మొలిచి అడవిని తలపిస్తున్నాయి. కొంతమేర ప్రహరీ సైతం కూలిపోయింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నూతన భవన నిర్మాణానికి రూ.1.98కోట్లను మంజూరు చేసి, ఐసీఎస్ రోడ్డులో 30సెంట్ల భూమిని కేటాయించారు. అప్పట్లో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో నిర్మాణ పనులు మొదలవలేదు. తర్వాతఅధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నిధులు నిలిచిపోయాయి. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాల్సి ఉంది.

ఉద్యాన పంటల సాగుపై శిక్షణ

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 22: పెరియవరంలోని కృషివిజ్ఞాన కేంద్రంలో గురువారం జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో ఉద్యాన పంటల సాగుపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడీఏ డాక్టర్ భాస్కరయ్య, శాస్త్రవేత్త గోవిందురాజులు, ఏడీఏ నాగార్జున, పి.సుజాత, తిరుపాల్, ఆనంద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దక్కిలి: మోపూరు గ్రామంలోనూ రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీఆర్‌సీ ఏడీఏతోపాటు విజయభారతి పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ



మధుసూదన్ నాయుడితో మాట్లాడుతున్న నెలవల సుబ్రహ్మణ్యం

పెళ్లకూరు, ఫిబ్రవరి 22: పెళ్లకూరుకు చెందిన పేరం మధుసూదన్‌నాయుడిని సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం గురువారం పరామర్శించారు. ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్న ఆయన యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నెలవలవెంట టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, పేరం చంద్రబాబునాయుడు, నాయకులు వెంపళ్ల వెంకటేశ్వర్లు, నెలవల ప్రసాద్, పెళ్లకూరు గోపాల్‌కృష్ణ, బందుల సాయిప్రసన్న, పాలెల అంకయ్య తదితరులున్నారు.

'స్త్రీ, శిశు మరణాలు తగ్గించడమే లక్ష్యం'

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 22: స్త్రీ, శిశు మరణాలు తగ్గించడమే లక్ష్యంగా ఆరోగ్య శాఖ సిబ్బంది పనిచేయాలని జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారి శ్రీనివాసరావు అన్నారు. గురువారం వల్లివేడు సచివాలయంలో రక్త హీనత ఉన్న పిల్లలు, గర్భిణులను గుర్తించి వైద్యపరీక్షలు నిర్వహించారు. నాగేంద్ర కుమార్, బేబి కుమారి, ప్రకాశ్, భాస్కర్ రావు, రెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'ఓటర్ల జాబితాలోని తప్పులు సరిచేస్తున్నాం'

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 22: ఓటర్ల జాబితాలోని తప్పులను సరిచేస్తున్నామని తహసీల్దారు కె.కళ్యాణి అన్నారు. తహసీల్దారు కార్యాలయంలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. జాబితాలో మృతి చెందినవారు, డబుల్ ఎంట్రీలు, వలస వెళ్లినవారికి ఓట్లు ఉండటం వంటివి గుర్తించామన్నారు. దీనిపై బీఎల్వోలను సమావేశపరచి.. బూత్ లవారీగా క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని చెప్పారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పెళ్లకూరు, ఫిబ్రవరి 22: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ కేవీఆర్వీ ప్రసాద్‌రావు గురువారం పరిశీలించారు. కలవకూరు, అనకవోలు, పాలచ్చూరు, కప్పగుంటకండ్రిగ, రోసనూరు బంగారంపేట మోదుగులపాలెం తదితర గ్రామాలోని కేంద్రాలను పరిశీలించినట్లు తెలిపారు. వీఆర్వోలు వంశీకృష్ణ, యాశ్మిన్ తదితరులు ఉన్నారు.

రైల్వే వంతెనల పరిశీలన



నేతాజీ నగర్ గేటు వద్ద డీఆర్ఎం విశ్వనాథ్

దొరవారిసత్రం, ఫిబ్రవరి 22: దొరవారిసత్రం మండల పరిధిలో రైల్వే వంతెనలను దక్షిణ మధ్య రైల్వే డీఆర్ఎం ఈబీ విశ్వనాథ్ పరిశీలించారు. నేతాజీనగర్, అక్కరపాక, పోలిరెడ్డిపాళెం, దొరవారిసత్రం, నెలబల్లి గ్రామాల్లో ఉన్న రైల్వే వంతెనలను ఆయన పరిశీలించారు. ఈ వంతెనల కింద వర్షాకాలం వర్షపు నీరు నిల్వచేరి వాహనదారులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని రైల్వే సిబ్బంది ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రత్యామ్నాయ చర్యలను వెంటనే చేపట్టాలను సూచించారు. ఆయనవెంట ఏడీఆర్ఎం ప్రతాప్ పలువురు రైల్వే సిబ్బంది ఉన్నారు.

టీడీపీ కార్యకర్త మృతి



బాధితులతో మాట్లాడుతున్న మాజీమంత్రి పరసారత్నం

పెళ్లకూరు, ఫిబ్రవరి 22: చెంబేడు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మారాబత్తిన రామచంద్రయ్య (46) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీమంత్రి పరసారత్నం, టీడీపీ యువనాయకుడు చింతల సతీష్‌చంద్ర తదితరులు రామచంద్రయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబసభ్యులను ఓదార్చారు. వీరివెంట టీడీపీ నాయకులు నల్లమాకుల కమలాకర్‌బాబు, మల్లికార్జునరెడ్డి, వేలూరు రమణయ్య, దామతోటి సుబ్రహ్మణ్యం, బాలాజీ, ఆరూరు సుబ్రహ్మణ్యం, గుంటపూడి గురవయ్య, జనసేన మండల అధ్యక్షుడు మల్లాం విజయ్ తదితరులున్నారు.

కోట ఇన్‌చార్జి ఏఈగా నారాయణరెడ్డి

కోట, ఫిబ్రవరి 22: కోట విద్యుత్ సబ్‌స్టేషన్ ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఏఈగా నారాయణరెడ్డిని గురువారం నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న మునీంద్ర పదోన్నతిపై తిరుపతికి వెళ్లడంతో చెందోడు సబ్‌స్టేషన్‌లో సబ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న నారాయణరెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు.

రైతులపై కాల్పులు దుర్మార్గం: సీఐటీయూ



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 22: రైతుల సమస్యలపై ఉద్యమం చేస్తున్న రైతులపై కాల్పులు చేయడం దుర్మార్గమని సీఐటీయూ నాయకుడు సాంబశివయ్య అన్నారు. పంజాబ్-హరియాణా సరిహద్దులోని ఖానౌరి వద్ద రైతులపై పోలీసుల కాల్పులకు నిరసనగా గురువారం ఆర్టీసీ బస్టాండు సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఐటీయూ, రైతు సంఘ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఉద్యమాన్ని అణచి వేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేయడంతోపాటు కాల్పులు జరపడాన్ని సీఐటీయూ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. సీఐటీయూ నాయకులు అల్లెయ్య, రియాజ్, పళణి, పద్మనాభం, మనోహర్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని దంపతులకు తీవ్రగాయాలు

కోట, ఫిబ్రవరి 22: వీరారెడ్డిసత్రం సమీపంలో గురువారం ఓ బైక్ ఢీకొన్న సంఘటనలో గ్రామానికి చెందిన అంకయ్య, లక్ష్మమ్మ దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ దంపతులు గురువారం సైకిల్‌పై క్రాస్‌రోడ్డు సమీపంలోకి వస్తుండగా.. వాకాడు నుంచి బైక్‌పై వస్తున్న ఓ యువకుడు వీరిని ఢీకొట్టి పడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ దంపతులను స్థానికులు చికిత్స నిమిత్తం కోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అర్హులకు విరివిగా రుణాలివ్వాలి

- లీడ్ బ్యాంక్ మేనేజర్ సుభాష్

నాయుడుపేట, ఫిబ్రవరి 22: అర్హులైన వారికి విరివిగా రుణాలివ్వాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ సుభాష్ అన్నారు. నాయుడుపేట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాల్లోని బ్యాంకర్లు, అధికారుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. విద్యార్థులకు ఉన్నత విద్యాభ్యాసం కోసం, యువతకు ఉపాధి కోసం, టిడ్కో గృహాలకు, వ్యవసాయ రంగానికి రుణాలను ఇవ్వాలని సూచించారు. అలాగే స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక బలోపేతానికి అంతర్గత రుణాలు, బ్యాంక్ ఖాతాదారులకు బీమా పథకాలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రేమ్‌రాజ్‌కుమార్, టిడ్కో జిల్లా కోఆర్డినేటర్ భాస్కర్‌రెడ్డి, మెప్మా బ్యాంక్ లింకేజీ డీపీ ఎం.బాబా, డీఆర్‌డీఏ డీపీ సుబ్బారెడ్డి, మెప్మా, వెలుగు, వ్యవసాయశాఖ, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

'సాగరమాల' భూరికార్డుల పరిశీలన



రికార్డులు తనిఖీ చేస్తున్న ఆర్డీవో చంద్రముని

నాయుడుపేట, ఫిబ్రవరి 22: మండలంలోని పుదూరు, కాపులూరు ప్రాంతాల్లో సాగరమాల రహదారి ఏర్పాటుకు కోల్పోయే భూముల రికార్డులను ఆర్డీవో చంద్రముని పరిశీలించారు. నాయుడుపేట తహసీల్దారు కార్యాలయంలో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. క్షేత్రస్థాయిలో భూములను, వాటి హక్కుదారులను గుర్తించాలని తహసీల్దారు కె.కళ్యాణి, డిప్యూటీ తహసీల్దారు రాజేంద్రలకు సూచించారు.

ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను పోటీకి దింపుతాం

- ఏపీ ప్రజాసంఘాల ఐక్యవేదిక

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 22: వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను పోటీలోకి దింపుతామని ఏపీ ప్రజాసంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు గద్దల మునెయ్య తెలిపారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అన్ని ప్రజాసంఘాలతో అఖిలపక్షం ఏర్పాటు చేసి.. అభ్యర్థులను త్వరలో ప్రకటిస్తామన్నారు.

ఈ వస్తువులు కార్గోలో నిషిద్ధం

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 22: ప్రజాప్రయోజనాల దృష్ట్యా ఆర్టీసీ కార్గోలో నిషేధిత వస్తువులు స్వీకరించేది లేదని కమర్షియల్ ఏటీఎం సురేంద్రబాబు తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నిషేదిత వస్తువుల మూలాన చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అలాంటివి బుక్‌చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెట్రోల్, డీజిల్, గోపాలిన్(పెట్రో కెమికల్స్), కిరోసిన్, స్పిరిట్స్, టర్పెంట్ ఆయిల్, యాసిడ్, సల్ఫర్, కోల్‌తార్, గన్‌ఫౌడర్, తుపాకి, తోలు, చర్మాలు, పచ్చి, ఎండు చేపలు, పేలుడుపదార్థాలు, గ్యాస్ సిలిండర్లు, కళేబరాలు, ఆర్డినెన్స్, ఎముకలు, కొమ్ములు, అన్నిరకాల జంతువులు, బ్యాటరీలు, బొగ్గు, నల్లమందు, గంజాయి, మాదకద్రవ్యాలు, గుట్కా,పొగాకు, పాన్‌మసాలాలు,స్కూటర్, మోటార్ సైకిళ్లు, తలవెంట్రుకలు, సన్‌మైకా రోల్స్, గాజు వస్తువులు, లిక్విడ్ ఆయిల్స్, ఇంక్, పెయింట్స్ తదితరాలు నిషేధించామని, ప్రజలు సహకరించాలని కోరారు.

మద్యం, గంజాయికి యువత బానిసలైపోయారు

వీసీకే ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న శివప్రసాద్

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 22: రాష్ట్రంలోని యువత మద్యం, గంజాయికి బానిసై పోయిందని, దీనికి సీఎం జగన్ పాలనే కారణమని వీసీకే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ విమర్శించారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక హోదా, పోలవరం, కడప ఉక్కు, రాజధాని, రాయలసీమ, ఉత్తరాంధ్రులకు ప్రత్యేక ప్యాకేజీ సాధించడం చేతకాని జగన్ మోహన్‌రెడ్డి వైనాట్ 175 అంటూ కామెడీ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. మోదీ దేశాన్ని నాశనం చేస్తుంటే జగన్ రాష్ట్ర సంపదంతా లూటీ చేశారని విమర్శించారు. ప్రజలు జగన్‌కు ఓట్లు వేయడానికి సిద్ధంగా లేరన్నారు. రాష్ట్రంలో వీసీకే ఇండియా కూటమితో కలిసి పోటీ చేస్తుందన్నారు. మార్చి 5న వీసీకే ఆధ్వర్యంలో మదనపల్లిలో ఇండియా కూటమి బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. ప్రజలు పెద్దసంఖ్యలో హాజరుకావాలని తెలిపారు. ఈ సమావేశంలో మురగేషన్ ప్రభు, రమేష్, మోహన్, శ్రీనివాసులు, రెడ్డెప్ప, రెడ్డి ప్రసాద్, చౌడప్ప, మణి తదితరులు పాల్గొన్నారు.

వేమిరెడ్డిని కలసిన టీడీపీ నేతలు




వేమిరెడ్డితో నెలవల సుబ్రహ్మణ్యం, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు - పుష్పగుచ్ఛమిస్తున్న వేనాటి రామచంద్రారెడ్డి

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 22: ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో గురువారం సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, పార్టీ సీనియర్ నాయకుడు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. వీరివెంట టీడీపీ నాయకులు అరవపెరిమిడి చంద్రారెడ్డి, గోపాలకృష్ణ తదితరులున్నారు.

సూళ్లూరుపేట: వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని గురువారం నెల్లూరులోని ఆయన నివాసంలో టీడీపీ నేత వేనాటి రామచంద్రారెడ్డి కూడా మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే వేమిరెడ్డి సతీమణి ప్రశాంతి రెడ్డిని కూడా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

వారంగా తెరుచుకోని దామానెల్లూరు సొసైటీ

- ఇబ్బంది పడుతున్న రైతులు



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 22: మండల పరిధిలోని దామనెల్లూరు సొసైటీ.. అధికారులు లేక వారం రోజులుగా మూతపడింది. రైతులకు నిరంతరం అందుబాటులో ఉండాల్సిన సొసైటీ సీఈవో లేకపోవడంతో తెరవలేదు. ఇక్కడ ఇన్‌చార్జిగా పనిచేస్తుండిన సీఈవో బదిలీపై వెళ్లడంతో వేరే అధికారి ఎవరూ రాకపోవడంతో మూతపడినట్లు సమాచారం. వరి కోతల సీజన్ కావడంతో రైతులు రుణాలను రెన్యువల్ చేయాలన్నా, తీసుకోవాలన్నా 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న సూళ్లూరుపేటకు వెళ్లాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి సొసైటీని తెరవాలని రైతులు కోరుతున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.60 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.60 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి గురువారం ఉదయం ప్రకటించింది.